Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 291 మేడ్చల్ మల్కాజ్‌గిరి 9 నవంబర్ 2023 గురువారం

## భారతీయులకు సౌదీ ఈ-వీసా!

న్యూఢిల్లీ : భారత్‌తో పర్యాటక సంబంధాలను మెరుగుపర్చుకోవడానికి కట్టుబడి ఉన్నామని సౌదీ అరేబియా టూరిజం అథారిటీ (ఆసియా పసిఫిక్) అధ్యక్షుడు అల్‌హసన్ అల్దాబ్బాగ్ అన్నారు. భారతీయుల సౌదీ ప్రయాణాన్ని సులభతరం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అమెరికా, బ్రిటన్ లేదా స్కెంజెన్ వీసా కలిగి దానిపై ఒకసారైనా ప్రయాణించిన భారత పాస్‌పోర్టు ఉన్న వారు ఇకపై సౌదీ ఈ-వీసా కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వీటిని అందించేందుకు 96 గంటల స్టాప్‌ఓవర్ వీసా, 9 వీఎఫ్ఎస్ తహసీల్ కార్యాలయాలను భారత్‌లో తెరిచామని వెల్లడించారు. వ్యాపారం, ఉద్యోగాల కోసం, బంధువులను కలిసేందుకు, మక్కా మదీనాను సందర్శించేందుకు ఏటా భారీగానే భారతీయులు సౌదీ వస్తున్నారని ఆయన తెలిపారు.

# వాళ్లది చీకటి ఒప్పందం

## బిజెపికి ఓటేసినా బిఆర్ఎస్‌కు వేసినట్లే




## తెలంగాణ సర్కార్ రైతులకు తీవ్ర అన్యాయం చేసింది: రేవంత్

ఆదిలాబాద్: తెలంగాణ ప్రభుత్వం రైతులకు తీవ్ర అన్యాయం చేసిందని టీపీసీసీ రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తెలంగాణ సీఎం చంద్రశేఖర్ రావు రూ.లక్ష కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. చివరకు రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి దేశాన్ని వదిలి పారిపోతారని అన్నారు. వీళ్లను గెలిపిస్తే ఆలి మీద తాళిని కూడా లాక్కుపోతారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'దొరల తెలంగాణ కావాలా.. ప్రజా తెలంగాణ కావాలా?' తేల్చుకోవాలని ఓటర్లను ఉద్దేశించి అన్నారు. దోచుకోమంటూ పిల్ల రాక్షసులను ప్రజల్లోకి వదిలాడని కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి విరుచుకుపడ్డారు. పిల్ల రాక్షసులకు బ్రహ్మ రాక్షసుడు కేసీఆర్ ధ్వజమెత్తారు. జోగు రామన్న ఆదిలాబాద్‌ను దోచుకున్నారని ఆయన విమర్శలు గుప్పించారు. ఈ మేరకు ఆదిలాబాద్‌లో నిర్వహించిన 'కాంగ్రెస్ విజయభేరి యాత్ర'లో రేవంత్ రెడ్డి మాట్లాడారు.

**బీజేపీకి ఓటేస్తే.. బీఆర్ఎస్‌కు ఓటేసినట్లే...** బీజేపీకి ఓటు వేస్తే బీఆర్ఎస్‌కు వేసినట్టేనని రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం నిర్వహించిన సభలో కాళేశ్వరం గురించి మోదీ ఎందుకు మాట్లాడలేదు? అని ప్రశ్నించారు. మేడిగడ్డకు మోదీ ఎందుకు పోలేదని, మేడిగడ్డ గురించి మాట్లాడడు కానీ, ఢిల్లీ లిక్కర్ స్కామ్‌పై మోదీ మాట్లాడుతారని మండిపడ్డారు. కడెం, శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులను కట్టింది కాంగ్రెస్ కాదా? అని అన్నారు.

ఇక పార్టీలో ఆశావహులు ఎందరు ఉన్నా ఒక్కరికే టికెట్ ఇవ్వగలమని, టికెట్ రాని వారిని కాంగ్రెస్ కాపాడుకుంటుందని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉపాధిహామీ కూలీలకు రూ.12 వేలు అందిస్తామని హామీ ఇచ్చారు.

**కాంగ్రెస్ సునామీలో బీఆర్ఎస్ కొట్టుకుపోతుంది.. రూ.4 వేలు పెన్షన్ ఇస్తాం...** రాజేంద్రనగర్‌లో కాంగ్రెస్ ప్రజా విజయభేరి సభలో తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ సర్కారుపై విమర్శలు గుప్పించారు. తెలంగాణలో అన్ని వర్గాలకు అన్యాయం జరిగిందని, తాగుడులో తెలంగాణను నంబర్ వన్ చేశారని రేవంత్‌రెడ్డి సీఎం కేసీఆర్‌పై మండిపడ్డారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఎందరికి ఇచ్చారని, కాంగ్రెస్ సునామీలో %BRS% కొట్టుకుపోతుందని రేవంత్‌రెడ్డి జోస్యం చెప్పారు. తెలంగాణలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రూ.4 వేలు పెన్షన్ ఇస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు.

**బరా బర్ ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలుపుతాం...** ఎన్నికల ప్రచారంలో టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి దూసుకుపోతున్నారు. ప్రచారంలో భాగంగా ఈరోజు (బుధవారం) ఉట్నూర్‌లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ప్రజా గర్జన సభలో టీపీసీసీ చీఫ్ పాల్గొని ప్రసంగించారు. బరా బర్ ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలుపుతామని అన్నారు. ధరణిని రద్దు చేస్తే రైతుబంధు రద్దు అవుతుందని కేసీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ధరణి ముసుగులో కేసీఆర్ కుటుంబం హైదరాబాద్ పరిసర భూములను కబ్జా చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ టికెట్లు అమ్ముకుంటున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కోట్ల రూపాయలు ఉన్నోళ్లకే బీఆర్ఎస్ - బీజేపీ టికెట్లు ఇస్తే, ఓట్లున్న వారికే కాంగ్రెస్ ఇచ్చిందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రారంభించిన ప్రాణహిత ప్రాజెక్టును కేసీఆర్ దెబ్బ తీశారన్నారు. కాళేశ్వరం పేరిట లక్ష కోట్లు కేసీఆర్ దిగ మింగారని ఆరోపించారు. కేసీఆర్ ధన దాహానికి ప్రాణహిత ప్రాజెక్టు బలైందన్నారు. కాంగ్రెస్ కట్టిన కడెం, సదర్‌మాట్ ప్రాజెక్టులను కేసీఆర్ పట్టించుకోలేదన్నారు. దళిత - గిరిజనుల పట్ల కాంగ్రెస్‌కు ఉన్న ప్రేమ.. దేశంలో మరే పార్టీకి లేదని రేవంత్ అన్నారు.

**కేసీఆర్‌కు రేవంత్ సవాల్...** కరెంటుపై కేసీఆర్ అబద్దాలు మాట్లాడుతున్నరని విమర్శించారు. "ఏ సబ్ స్టేషన్‌లోకైనా పోదాం.. 24 గంటలు కరెంటు ఇస్తున్నట్టు నిరూపిస్తే నేను నామినేషన్ వేయను. లేకుంటే కేసీఆర్ ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలి" అంటూ రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. అసైన్డ్ భూములు, పోడు భూములకు అన్ని రకాల హక్కులు కలిపిస్తామని హామీ ఇచ్చారు. ఆదివాసీ - లంబాడీల మధ్య పంచాయతీని కాంగ్రెస్ తీరుస్తుందని తెలిపారు. మిమ్మల్ని కాపాడుకునే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందని అన్నారు. లంబాడీ - ఆదివాసులు తనకు రెండు కళ్ల లాంటివారని.. ఎవరికీ అన్యాయం జరగనివ్వమని హామీ ఇచ్చారు. ఇంద్రవెల్లి సాక్షిగా ప్రమాణం చేస్తున్నా... కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆదిలాబాద్‌ను దత్తత తీసుకుంటామని అన్నారు. ఇంద్రవెల్లి కాల్పుల్లో చనిపోయిన కుటుంబాలను ఆదుకునే బాధ్యత కాంగ్రెస్‌ది అని స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన తప్పులను సరిదిద్దుకుంటామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## ఇప్పటిదాకా ట్రైలరే చూశారు.. ఇంకా చాలా ఉంది



హైదరాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇప్పటిదాకా చూసింది ట్రైలర్ మాత్రమేనని.. ఇంకా చాలా ఉందని మంత్రి కేటీఆర్ అన్నారు. సోమాజిగూడలోని ఓ హోటల్‌లో పారిశ్రామికవేత్తలనుద్దేశించి కేటీఆర్ ప్రసంగించారు. "పిల్లలకు పరీక్షలు వచ్చినప్పుడు ఎలా ఉంటుందో తమకు ఎన్నికలొస్తే అలాగే ఉంటుంది. నేను పూర్తి రాజకీయ నాయకుడిగానే మీ మద్దతు కోసం వచ్చా. పారిశ్రామికవేత్తలాగా కాకుండా ఒక్క పౌరుడిలా ఆలోచన చేయండి. తెలంగాణ వచ్చిన తర్వాత కేసీఆర్‌ను ఎంత మంది ఎన్ని మాటలు అన్నారో గుర్తు చేసుకోండి. పరిపాలన రాదు.. కరెంట్ ఉండదు.. ఆంధ్ర వాళ్లను వెళ్లగొడతారు అని, గొడవలు జరుగుతాయన్నారు. భూముల విలువ పడిపోతుంది అని కొంత మంది అనుమానాలు, అపోహలు వ్యక్తం చేశారు. ఆనాడు తెలంగాణలో పవర్ సమస్య ఎంత తీవ్రంగా ఉండేదో తెలిసిందే. ఇప్పుడు 10 నిముషాలు కరెంట్ పోతే తట్టుకోలేపోతున్నారు. కర్ణాటక డిప్యూటీ సీఎం శివకుమార్ తెలంగాణకు వచ్చారు.. పాపం అయనకు స్క్రిప్ట్ సరిగ్గా ఇవ్వలేదు. కర్ణాటకలో 5 గంటలు కరెంట్ ఇస్తున్నామని చెబుతుంటే తెలంగాణ ప్రజలు నవ్వుతున్నారు. 2014కు ముందు నగర శివారు కాలనీలకు 14 రోజులకు ఒక్కసారి నీళ్లు వచ్చేవి.

ఇప్పుడు రోజు వస్తున్నాయి. మా ఆలోచనలు ఇంకా ఉన్నాయి. 24 గంటలు నీళ్లు ఇవ్వాలి అనేది మా ఆలోచన." అని కేటీఆర్ తెలిపారు. "2014కు ముందు భూముల ధరలు ఎలా ఉన్నాయి.. ఇప్పుడెలా ఉన్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఇక్కడికి పరిశ్రమల వస్తున్నాయి. స్టేబుల్ గవర్నమెంట్ ఉండటం వలనే ఇది సాధ్యమైంది. ప్రభుత్వం స్థిరత్వం లేకపోతే ముందుగా దెబ్బ తినేది పరిశ్రమలే. అదే వేరే వాళ్లు వస్తే వాళ్లు ఢిల్లీకి వెళ్లి వాళ్ల పర్మిషన్ తీసుకోవాలి. వాళ్లను ఒప్పించాలి. అవినీతి లేకుండా తమ ప్రభుత్వం పరిశ్రమలకు ప్రోత్సహం అందించింది." అని కేటీఆర్ చెప్పుకొచ్చారు.

## 4 రోజుల వ్యవధిలో రెండోసారి తెలంగాణకు రానున్న ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాలుగు రోజుల వ్యవధిలో రెండోసారి తెలంగాణ రాష్ట్రానికి రానున్నారు. దళితులకు భరోసా ఇవ్వనున్నారు. ఈనెల 11న తెలంగాణకు ప్రధానమంత్రి మోదీ వస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి.

**మినిట్ టూ మినిట్ షెడ్యూల్ వివరాలు ఇలా ఉన్నాయి :** 11వ తేదీ సాయంత్రం 4.45 నిమిషాలకు మోదీ బేగంపేట విమానాశ్రయం చేరుకోనున్నారు. 5 గంటలకు రోడ్డు మార్గంలో పరేడ్ గ్రౌండ్స్‌కు మోదీ చేరుకుంటారు. 5 గంటల నుంచి 5.45వరకు పెరేడ్ గ్రౌండ్స్ సభలో మోదీ ప్రసంగిస్తారు. 5.55లకు తిరిగి బేగంపేట విమానాశ్రయానికి మోదీ చేరుకోనున్నారు. 6 గం. కు బేగంపేట నుంచి మోదీ ఢిల్లీకి వెళ్తారని బీజేపీ నేతలు వెల్లడించారు.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ దళారీ రాజ్యమే..

## ఎవరు గెలిస్తే మంచిదో నిర్ణయించి ఓటేయాలి.. అలవోకగా వేయొద్దు : సీఎం కేసీఆర్

కాగజ్‌నగర్ : ఎన్నికలు వచ్చినప్పుడు ఆగమాగం కాకుండా.. ఎవరు గెలిస్తే మంచిదో నిర్ణయించి ఓటేయాలి.. ఆషామాషీగా, అలవోకగా ఓటు వేయొద్దని ముఖ్యమంత్రి కేసీఆర్ సూచించారు. సిర్పూర్ కాగజ్‌నగర్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు అయింది. కానీ ఇప్పటి వరకు కూడా ప్రజాస్వామ్య ప్రక్రియ రావాల్సిన పరిణితి రాలేదు. ఏ దేశాల్లో అయితే ప్రజాస్వామ్యంలో పరిణితి వచ్చిందో ఆ దేశాలు చాలా బాగా ముందుకు పోతున్నాయి. మన దేశంలో ఇంకా ఆ పరిస్థితి లేదు. రావాల్సిన అవసరం ఉంది. ఎలక్షన్లు చాలా వస్తాయి పోతాయి. ఎన్నికల్లో ఎవరో ఒకరు గెలుస్తరు అందరికీ తెలుసు. మీరు చాలా సార్లు ఓట్లేశారు. ఇప్పుడు ఎన్నికలు వచ్చాయి. ప్రతి పార్టీ తరపున ఒకరు నిలబడుతారు. కోనప్ప బీఆర్ఎస్ తరపు ఉన్నారు. 30న ఓట్లు పడుతాయి. 3న లెక్కింపు అయిపోతది. ఫలితం తేలుతుందన్నారు కేసీఆర్. మీరు నిర్ణయం తీసుకోవాల్సి ఏందంటే అభ్యర్థి గుణగణాలు, సేవాతత్వం గురించి ఆలోచన చేయాలి. ఆ అభ్యర్థుల వెనుకాల ఏ పార్టీ ఉంది. వాటి చరిత్ర విధానాలు, ప్రజలు, రైతుల గురించి ఏం ఆలోచిస్తుంది..? అధికారం వస్తే ఎలా ప్రవర్తిస్తారో ఆలోచించాలి. ఎన్నికలు అయిపోగానే ప్రక్రియ ఆగిపోదు. ఇక్కడ గెలిచే ఎమ్మెల్యేతో రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడుతుంది. మీ ఓటు వజ్రాయుధం, చాలా విలువ ఉంటది. ఐదేండ్లు మీ తలరాతను రాస్తది. భవిష్యత్‌ను నిర్ణయిస్తది. అందుకే జాగ్రత్తగా ఓటు వేయాలి. ఆషామాషీగా, అలవోకగా వేయొద్దు. మంచి ఆలోచించే వారికి ఓట్లు వేయాలి. ఏ ప్రభుత్వం ఏం చేసిందో లెక్క తీసి ఓట్లు వేస్తే లాభం జరుగుతది. ప్రజాస్వామ్య పరిణితి పెరిగి, విచక్షణ జ్ఞానంతో ఎవరు గెలిస్తే మంచిదో నిర్ణయించి ఓటేయాలి అని ప్రజలకు కేసీఆర్ సూచించారు.

**ఆసిఫాబాద్ జిల్లా కావడంతో.. మన్యం బిడ్డలకు మంచి జరిగింది : సీఎం కేసీఆర్**

ఆసిఫాబాద్ : ఆసిఫాబాద్ జిల్లా కావడంతోనే.. మెడికల్ కాలేజీతో పాటు వందలాది పడకలతో హాస్పిటల్ కూడా వచ్చిందని, దాంతో మన్యం బిడ్డలకు మంచి జరిగిందని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని కోవా లక్ష్మీకి మద్దతుగా ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రం కాకపోతే ఆసిఫాబాద్ జిల్లా కాకపోయేది. ఎన్నో ప్రయత్నాలు చేసినా ఎవరూ కూడా జిల్లా చేయలేదు.

మారుమూల ప్రాంతం ఆసిఫాబాద్ జిల్లా అయితదని కలలో కూడా ఎవరూ అనుకోలేదు. కానీ ఇవాళ బీఆర్ఎస్ గవర్నమెంట్ ఉంది కాబట్టి, గిరిజన బిడ్డలకు, పేద వర్గాలకు న్యాయం జరగాలని జిల్లా చేశాం. మీరందరూ చూస్తుండగానే కలెక్టరేట్, ఎస్పీ ఆఫీసు కట్టుకున్నాం. నేనే ప్రారంభించాను. ఆసిఫాబాద్ జిల్లా కావడంతో ఒక మంచి మేలు జరిగింది. వర్షాకాలం వచ్చిందంటే గుట్ట మీద గూడెం, గుట్ట కింద వాగుల నీళ్లు.. ఆ కలుషిత నీళ్లు తాగి అంటురోగాలు వచ్చేవి. గిరిజన బిడ్డలు రోగాల బారిన పడేవారు. మంచం పట్టిన మన్యం అని వార్తలు వచ్చేవి. ఇవాళ ఆ బాధ పోయింది. ఆసిఫాబాద్‌లో మెడికల్ కాలేజీ వస్తదని ఎవరూ అనుకోలేదు.

మెడికల్ కాలేజీతో పాటు వందలాది పడకల హాస్పిటల్ కూడా రావడంతో మన్యం బిడ్డలకు మంచి జరిగింది అని కేసీఆర్ తెలిపారు. తెలంగాణ కోసం పోరాటం చేసిన మహాయోధుడు.. జల్,



జంగల్, జమీన్ నినాదంతో కొట్లాడిన మహాయోధుడు మన కొమ్రం భీం. ఆయన పేరు మీద కొమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అని నామకరణం చేశాను. ఈ విషయం మీ అందరికీ తెలుసు. కొమ్రం భీం పోరాటం చేసిన స్థలంలో కెరెమెరి ఘాట్స్‌ను ఏ గవర్నమెంట్ కూడా పట్టించుకోలేదు. 2014 తర్వాత బీఆర్ఎస్ గవర్నమెంట్ వచ్చిన తర్వాత స్వయంగా నేనే అక్కడికి వెళ్లి.. కొమ్రం భీం స్మారక చిహ్నం నిర్మాణం చేసుకున్నాం. ఇవన్నీ మీ కండ్ల ముందున్నాయి.. జరిగాయి అని కేసీఆర్ తెలిపారు.

## సంపాదకీయం

# మోడీ సర్కారు సమర్పించు 'భారత్' ఆటా.. కేజీ ఎంతంటే?

మరికొన్ని నెలల్లో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళలో.. పెరుగుతున్న ధరలు.. సామాన్యుల ఇక్కట్ల గురించి మోడీ సర్కారు తెగ థింక్ చేయటం షురూ చేసింది. గడిచిన పదేళ్లలో నిత్యవసర ధరలు విపరీతంగా పెరగటం.. జీవన వ్యయం గతంతో పోలిస్తే రెట్టింపు కావటం తెలిసిందే. మోడీ సర్కారు అనుసరిస్తున్న విధానాలతో సామాన్యుల నుంచి సంపన్నుల వరకు నిత్యం వినియోగించే పెట్రోల్.. డీజిల్ మీద వేసిన బాదుడు దెబ్బకు మిగిలిన అన్ని రంగాల్లోనూ ధరలు పెరిగాయి. దీనికి తోడు కరోనా ఎఫెక్టు దీనికి తోడైంది, ధరల పెరుగుదలపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తినప్పటికీ.. మౌనమే తన మార్కుగా వ్యవహరించే మోడీ సర్కారు మాట్లాడలేదు. అయితే.. ఎన్నికలు దగ్గరకు వచ్చిన వేళ.. సామాన్యులకు అండగా ఉండటమే తమ ప్రభుత్వ లక్ష్యమన్న మాటను చేతల్లో చూపించే పని షురూ చేసింది. మొన్నటికి మొన్న పప్పుల ధరలు భారీగా పెరగటంతో.. భారత్ డాల్ పేరుతో మార్కెటింగ్ మొదలు పెట్టిన కేంద్ర సర్కారు.. తాజాగా భారత్ ఆటా పేరుతో గోధుమ పిండి అమ్మకాల్ని షురూ చేసింది. బహిరంగ మార్కెట్ లో ఆన్ బ్రాండెడ్ గోధుమ పిండి కేజీ రూ.36 వరకు ఉంది. ఇలాంటి వేళ.. కేజీ గోధుమ పిండిని రూ.27.50కు అమ్మనున్నట్లుగా కేంద్రమంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. భారత్ ఆటా పేరుతో తయారు చేసిన కేజీ పాకెట్ ను దేశ వ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురానున్నారు. నేషనల్ కో ఆపరేటివ్ కన్స్యూమర్ ఫెడరేషన్.. నేషనల్ అగ్రికల్చర్ కో ఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ద్వారా దేశంలోని 2వేల దుకాణాలకు 800 వాహనాలు భారత్ డాల్.. గోధుమపిండి.. ఉల్లిపాయలను సరఫరా చేయనున్నట్లుగా పేర్కొన్నారు. మొన్నటివరకు టమోటా ఠారెత్తిస్తే.. తాజాగా ఉల్లి ఘాటు మొదలైంది. దీంతో.. పెరిగే ధరలకు బదులుగా కేంద్రం ఉల్లిపాయల ధరలను సరసమైన ధరలతో ప్రజలకు అందించే ఏర్పాట్లు చేస్తోంది. ఇక.. భారత్ గోధుమపిండి కోసం భారత ఆహార సంస్థ నుంచి 2.5 లక్షల మెట్రిక్ టన్నుల గోధుమలను కేజీ రూ.21.5 కే ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఏజెన్సీలకు కేటాయించారు. అక్కడ తయారుచేసే ఆటా పిండిని దేశ వ్యాప్తంగా అమ్మనున్నారు. నిజానికి ఏ ఫిబ్రవరి నుంచి ప్రయోగాత్మకంగా కో ఆపరేటివ్ అవుట్ లెట్లలో కేజీ ఆటాను రూ.29.5కు అమ్ముతున్నారు. దీనికి బదులుగా ఇప్పుడు కేజీకి రూ.2 చొప్పున తగ్గిస్తూ రూ.27.5కే అందుబాటులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తోంది. మరి.. భారత్ ఆటా పేరుతో సిద్ధం చేసిన గోధుమపిండికి ప్రజల నుంచి ఎలాంటి స్పందన ఉంటుందో చూడాలి.

# నోడల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలి

### ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తప్పవు

### మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్



గరుడ వార్త మేడ్చల్ జిల్లా బ్యూరో: సాధారణ ఎన్నికలు 2023, ఎన్నికల నియమావళిలో బాగంగా గా మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో అన్ని శాఖల నోడల్ అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయంతో తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి ఎన్నికల వ్యయం , ఎక్సైజ్, జీఎస్టీ, ఎంసిసి, నోడల్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ... శాసనసభ సాధారణ ఎన్నికల ఏర్పాట్లకు సంబంధిం చిన అంశాలపై ఆయా నోడల్ అధికారులు పూర్తి అవగాహన కలిగివుండాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ అన్నారు. ఎన్నికల విధులు ఎంతో కీలకమైనవని, ఎక్కడా ఏ చిన్న పొరపాటు జరగకుండా అన్ని జాగ్రత్తలతో సమర్థవంతంగా నిర్వర్తించాలని అన్నారు. ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలకు గురి కావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే విధంగా నగదు, మద్యం, పంపిణీపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని ఇతర వస్తువుల సీజ్ చేసిన సందర్భాలలో అన్ని బృందాలు సమన్వయం చేసుకోవాలని సూచించినారు. జిల్లాలోని ఏర్పాటు చేసిన చెక్ పోస్టులలో వాహనాల తనిఖీలు నిష్పక్షపాతంగా, పకడ్బందీగా జరిగేలా చూడాలని, పట్టుబడిన వాటిని ఎన్నికల నియావళి మేరకు సీజ్ చేయాలని, ఎన్నికల సమయంలో సామాన్యులకు ఇబ్బందులు కలగకుండా పట్టుబడిన వాటిపై బృందాల ద్వారా సమక్షించుకుని త్వరగా చర్యలు తీసుకోవాల న్నారు. ముఖ్యంగా తనిఖీల సమయంలో సాధారణ ప్రజలకు అనవసర ఇబ్బందులు ఏర్పడకుండా సంయమనంతో వ్యవహరించాలని, నగదును జప్తు చేసిన సందర్భాలలో తగు రీతిలో విచారణ నిర్వహించి తప్పనిసరిగా రశీదులు అందించాలని ఆదేశించారు. అంతేకాకుండా తగిన ఆధారాలను చూపించి నగదును విడిపించుకునే వెసులుబాటు ఉంది అనే విషయాన్ని వివరించాలని, జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ కమిటీ గురించి తెలియజేయాలని సూచించారు. నోడల్ అధికారులు ప్రతి రోజు ఎన్ని కేసులు బుక్ చేస్తున్నాము వాటి యుక్కా వివరములు పూర్తి గా తెలపాలి అని నోడల్ అధికారులు ప్రతి రోజు తమ రిపోర్ట్లు ఒక నిర్ణిత మైన ఫార్మాట్ లో అని సమర్పిచాలని తెలిపారు. ఎన్నికల సమయంలో సీజ్ చేసే నగదు, బంగారం, మద్యం, ఇతర విలువైన అభరణాల విషయము లో నోడల్ అధికారులు అందరూ మరింత సమన్వయ తో ముందుకు పోవాలని తెలిపినారు . ప్రతి ఒక్కరూ తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాల్సిందిగా ఆకాంక్షించారు. అలాగే ఎన్నికలకు సంబంధించి ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని వాటిని పరిష్కరించేలా అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఈ సమావేశము లో నోడల్ అధికారులు , డీసీవో శ్రీనివాస మూర్తి, డీటీవో నర్సింహ , ఎక్సైజ్ సూపరింటెండెంట్లు అరుణ్ కుమార్, విజయ భాస్కర్, జీఎస్టీ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ లో చేరిన 11 మంది కీలక నేతలు...



శామీర్ పెట (గరుడ వార్త) : 11 మంది మాజీ, ప్రస్తుత ప్రజాప్రతినిధులు బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి, మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రి మల్లారెడ్డి ఏకపక్ష నిర్ణయాలతో వారు పార్టీని వీడినట్లుగా తెలుస్తోంది. మాజీ ఉమ్మడి షామీర్పేట్ మండల టిఆర్ఎస్ అధ్యక్షుడు వేమూరి విష్ణు గౌడ్, మాజీ మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుగుణ విష్ణు గౌడ్, రైతు బంధు సమితి శామీర్ పెట మండల అధ్యక్షుడు కమటం కృష్ణారెడ్డి, రైతు బంధు సమితి మూడు చింతలపల్లి మండల అధ్యక్షురాలు కే శ్యామల, శామీర్ పెట రైతు సహకార సంఘం పిసిసిఎస్ డైరెక్టర్లు ముద్దం ప్రతాప రెడ్డి, కమటం నరేందర్ రెడ్డి, జీలకర్ర విష్ణు, చంద్రకళ, మాజీ ఎంపీటీసీలు ఇప్ప మంజుల మాధవరెడ్డి, సకిరి లక్ష్మణ్ నాయక్, మాజీ ఉపసర్పంచ్ సంతోష్ కుమార్, సత్యనారాయణ తదితరులను మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి మల్లారెడ్డి సొంతింటి వాళ్లు ప్రతి మండలంలో రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. తద్వారా నిజాయితీగా పార్టీ కొరకు అహర్నిశలు కష్టపడి పని చేస్తున్న తమకు, ఇటు ప్రజల్లో అటు పార్టీలో ఏమాత్రం విలువ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి కేవలం బడా బాబులను, రియల్ ఎస్టేట్ వ్యాపారులను, భూకబ్జాదారులకు ప్రాదాన్యం ఇస్తున్నరంటూ మండిపడ్డారు. సదరు మంత్రి వంటెద్దు పోకడల వల్ల త్వరలో మరికొంతమంది ప్రజాప్రతినిధులు, భారీ స్థాయిలో కార్యకర్తలు బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్లో చేరనున్నట్లుగా వారు తెలిపారు.

# రోజురోజుకు బలహీన పడుతున్న బిఆర్ ఎస్ పార్టీ

### అంతే వేగంగా పుంజుకుంటున్న కాంగ్రెస్ పార్టీ : రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్



**శామీర్ పెట (గరుడ వార్త) : త్వరలో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనాన్ని గుర్తించి, డైనమిక్ లీడర్ పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డికి దండుగా నిలబడేందుకు బిఆర్ఎస్ పార్టీకి చెందిన కీలక నేతలు, కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్ అన్నారు. శామీర్ పెట మండల పరిధిలోని బొమ్మరాసిపేట గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని నక్క ప్రభాకర్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ గెలుపుని ఎవరు ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల్లో కాంగ్రెస్ పార్టీపై బలమైన నమ్మకం రోజురోజుకు బలంగా పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.**

# శివసత్తుల ఆటపాటల నడుమ ఘనంగా రేణుక ఎల్లమ్మకు బోనాలు...

శామీర్పేట (గరుడ వార్త) : ముత్తైదువలంతా బక్తిశ్రద్ధలతో రేణుక ఎల్లమ్మకు బోనాలను సమర్పించి తమభక్తిని చాటుకున్నారు. మండల కేంద్రం శామీర్ పేటలోని శ్రీ రేణుక ఎల్లమ్మవారి ప్రతిష్ఠాపన




చేసి ఆరో వార్షికోత్సవం, పురస్కరించుకొని అమ్మవారికి ఘనంగా భక్తులు బోనాలను సమర్పించారు. అమ్మవారి కళ్యాణం నిర్వహించగా, బుధవా రం గ్రామం నుంచి డప్పుల దరువులు ఒగ్గుడోలు మోతల మధ్య శివసత్తుల పూనకాలతో పెద్ద ఎత్తున అమ్మవారికి బోనాలను ఊరేగిం పుగా తీసుకువెళ్లారు.

ఆలయం వద్ద రేణుక ఎల్లమ్మ, ముత్యాలమ్మ వార్లకు బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బోడుప్పల్ కార్పొరేషన్ కార్పొరేటర్, మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్ తనయుడు అజయ్ కుమార్ యాదవ్ బోనాల ఉత్సవంలో పాల్గొన్నారు. యువకులు పలారం బండి ఘనంగా నిర్వహించారు.

# జిల్లాలో 41 నామినేషన్లు దాఖలు

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్.



గరుడ వార్త మేడ్చల్ జిల్లా బ్యూరో: రాష్ట్ర శాసనసభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా మేడ్చల్ జిల్లా పరిధిలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి బుధవారం రోజున 41 నామినేషన్లు దాఖలయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. మేడ్చల్



అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 17 మంది నామినేషనలు, 01)%CH%. మల్లారెడ్డి, భారత్ రాష్ట్ర సమితి 02)మురళీధర్ పెద్దపల్లి ,స్వతంత్ర అభ్యర్థి తదితరులు, ఇక మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి 07 నామినేషనలు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి 08 నామినేషనలు, కూకట్ పల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 03 నామినేషనలు, ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 04 నామినేషనలు, జిల్లా వ్యాప్తంగా నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అయిన నాటి నుండి ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 73 నామినేషన్లు దాఖలయ్యాయి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ స్పష్టం చేశారు.

# అటకెక్కిన ఆత్మ

ఖమ్మం : వ్యవసాయం లాభసాటిగా మారాలంటే అన్నదాతలకు ఆధునిక పరిజ్ఞానం అవసరం. దీనికోసం వారిని క్షేత్ర పర్యటనలకు తీసుకెళ్లాలి. అధిక దిగుబడులు సాధించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలి. ఇందు కోసం ప్రత్యేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ఆత్మ'(వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ)కు నిధుల్లేక పథకం ఉద్దేశం నీరుగారిపోతోంది. అసలు ఈ పథకం ఉంటుందా లేదాననే అనుమానం రైతుల్లో వ్యక్తమవుతోంది.

**నిధుల్లేక విజ్ఞాన యాత్రలు, సదస్సులు బంద్**

ఏటా ఒక్కో జిల్లా నుంచి రూ.50లక్షల వరకు ప్రతిపాదనలు పంపుతారు. వీటిలో రూ.15లక్షల నుంచి రూ.20లక్షల వరకు మంజూరు చేస్తారు. గత మూడేళ్ల నుంచి చిల్లిగవ్వ మంజూరు చేయకపోవటంతో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టడంలేదు. వానాకాలం సీజన్ మొదలైనప్పటికీ విజ్ఞాన ప్రదర్శన జాడే లేదు.

**బ్లాకుల్లో సైతం ఇదే పరిస్థితి**

జిల్లాలోని ఐదు వ్యవసాయ డివిజన్ల స్థానంలో ఐదు బ్లాక్ టెక్నాలజీ కార్యాలయాలున్నాయి. ఒక్కో దానిలో ఒక బీటీఎం, ఇద్దరు ఏటీఎంలు ఉండాలి. కూసుమంచిలో ఇద్దరు ఏటీఎంలు, వైరాలో ఒక ఏటీఎం, ఖమ్మంలో ఒక బీటీఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎక్కడా కూడా సరిపోయినంత మంది సిబ్బంది లేకపోవటంతో పరిస్థితి దారుణంగా ఉంది.

ఇవీ... లక్ష్యాలు వ్యవసా, అనుబంధ శాఖల విస్తరణ విభాగాలు బలోపేతం చేయటం. లి ప్రణాళిక అమల్లో రైతులను భాగస్వామ్యం చేయటం. లి పరిశోధన, విస్తరణ, మార్కెటింగ్, రైతుల లింకేజీలు.. లి పంటల వారీగా గ్రూపులను ఏర్పాటు చేయటం, వాటిని బలోపేతం చేయటం. లి రైతులకు ప్రదర్శన క్షేత్రాలు, శిక్షణ కార్యక్రమాలు, సామర్థ్య పెంపు సందర్శనలు. లి విజ్ఞాన యాత్రలు నిర్వహించటం, రైతు గ్రూపులకు రివాల్వింగ్ నిధులు, ప్రోత్సాహకాలు అందజేయటం.


ఉద్దేశం: జిల్లాలో వ్యవసాయ, అనుబంధ శాఖలు పాడి, పట్టు, మత్స్య, ఉద్యాన, సామాజిక అడవులు, రైతు సంఘాలు, ఎన్‌జీవోలు సమన్వయంతో సాంకేతిక పరిజ్ఞానం రైతులకు అందించి వారి సర్వతోముఖాభివృద్ధికి సహకరించటం.

**సిబ్బంది లేక ఇబ్బంది**

ప్రాజెక్టులో ఒక పథకసంచాలకుడు, ఉపసంచాలకుడు, సీనియర్ అసిస్టెంట్, ఒక కాంపోనెంట్ ఉండాలి. ప్రస్తుతం ఒక్క సీనియర్ అసిస్టెంట్ పనిచేస్తున్నారు. మిగతా పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం 'ఆత్మ' పథక సంచాలకురాలిగా డీఏవో ఎం.విజయనిర్మల ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.ప్రస్తుతం మా ప్రాజెక్టు ద్వారా రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తున్నాం. అధికారులు, సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే విజ్ఞాన యాత్రలు, అవగాహన సదస్సులు చేపడతాం. –ఎం.విజయనిర్మల, సంచాలకురాలు, ఖమ్మం

# ములుగు.. విప్లవాల పుట్టినిల్లు

ములుగు : ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే ములుగు అసెంబ్లీ నియోజకవర్గం విస్తీర్ణంలో అతి పెద్దది. ఆదివాసుల ఖిల్లాగా పేరొందింది. అటవీ ప్రాంతంతో కూడుకొని ప్రకృతి రమణీయతకు, పర్యాటకానికి చిరునామాగా మారింది. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయం, ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన గిరిజన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర, వేలాడే వంతెనల లక్నవరం సరస్సు, హేమాచల లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, తాడ్వాయి ఏటూరునాగారం అభయారణ్యాలు, గోదావరి నది, ఆసియాలోనే అతి పెద్ద దేవాదుల ఎత్తిపోతల పథకం, తుపాకుల గూడెం సమ్మక్క-సారక్క బ్యారేజి ములుగు అసెంబ్లీ నియోజకవర్గ ప్రత్యేకతలు. ఒకప్పుడు విప్లవ పార్టీలకు పుట్టినిల్లుగా నిలిచిన ములుగు ఎన్నో ప్రత్యేకతలు సంతరించుకుంది. నియోజకవర్గం ముచ్చట ములుగు అసెంబ్లీ నియోజకవర్గంలో దశాబ్దం కిందటి వరకు రాష్ట్రంలో ఎక్కడా లేనన్ని విప్లవ గ్రూపులు ఉండేవి. ఎన్నికల సమయంలో నాయకులు ప్రచారానికి వెళ్లాలంటే బిక్కుబిక్కుమంటూ ప్రచారం చేసుకోవాల్సిందే. నియోజవర్గంలోని 75 శాతం గ్రామాలు అటవీ ప్రాంతంతో ముడిపడి ఉండడంతో నక్సల్స్ గ్రూపులు ఆటవీ ప్రాంతాన్ని స్థావరాలుగా మార్చుకుని కార్యకలాపాలు సాగించేవి. సంచలనాలకు మారుపేరైన మావోయిస్టు పార్టీతోపాటు ప్రతిఘటన, జనశక్తి, ప్రజా ప్రతిఘటన, న్యూ డెమాక్రసీ పార్టీలు ములుగు నియోజకవర్గ కేంద్రంగా వాటి కార్యకలాపాలకు వ్యూహరచన చేసేవి. పోలీసుల ప్రాబల్యం పెరగడంతో ప్రస్తుతం మావోయిస్టులు మినహా




మిగిలిన అన్ని గ్రూపుల కార్యకలాపాలు తగ్గాయి. ప్రతిఘటన, ప్రజా ప్రతిఘటన, జనశక్తి పార్టీలు కూడా అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తుండేవి.

2,84,481 హెక్టార్ల విస్తీర్ణం

ములుగు అసెంబ్లీ నియోజకవర్గం మొత్తం 6,55,383 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. ఇందులో 1,98,445 హెక్టార్లలో అడవి ఉంది. చాలా గ్రామాలు అటవీ ప్రాంతంలో వాగులవతల ఉండటంతో నాటు పడవల్లో వెళ్లి పోలింగ్ నిర్వహించిన సందర్భాలున్నాయి. ప్రస్తుతం వంతెనల నిర్మాణంతో పోలింగ్ ఇబ్బందులు తగ్గాయి. నియోజకవర్గం ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు 16 సార్లు ఎన్నికలు జరిగాయి. ఆవిర్భావ సమయంలో పీడీఎఫ్ పేరుతో పోటీ చేసి కమ్యూనిస్టులు కైవసం చేసుకున్నా.. కాంగ్రెస్ అభ్యర్థులే ఎక్కువసార్లు గెలిచారు. రెండో స్థానంలో తెదేపా నిలిచింది. రాష్ట్రంలో తెరాస(ప్రస్తుతం భారాస) ఆవిర్భవించి సుమారు రెండు దశాబ్దాలు కావస్తున్నా.. 2014 ఎన్నికల్లో ఒక్కసారే గెలిచింది. ఇప్పటివరకు కాంగ్రెస్ ఎనిమిది సార్లు, తెదేపా నాలుగు సార్లు, పీడీఎఫ్ రెండు సార్లు, తెరాస ఒకసారి, ఇండిపెండెంట్ ఒకసారి గెలిచారు. 1967లో స్వతంత్ర అభ్యర్థిగా సంతోష్ చక్రవర్తి గెలిచి నియోజకవర్గంలో చరిత్ర సృష్టించారు. తొలిసారి జరిగిన 1952 ఎన్నికల్లో తొలి ఎమ్మెల్యేగా పీడీఎఫ్ నుంచి హనుమంతరావు గెలిచి చరిత్రలో నిలిచిపోయారు. 1957 ఎన్నికల్లో ములుగు మండలం లక్ష్మీదేవిపేటకు చెందిన సూర్యనేని రాజేశ్వర్‌రావు పీడీఎఫ్ రెండో ఎమ్మెల్యేగా గుర్తింపు పొందారు. ఆ తరువాత కమ్యూనిస్టులు ఏనాడూ దక్కించుకోలేదు. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 1978లో ములుగు నియోజకవర్గాన్ని గిరిజనులకు రిజర్వు చేశారు. పోరిక జగన్నాయక్ కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించి తొలి గిరిజన ఎమ్మెల్యేగా నమోదయ్యారు. 1983లో ఎన్టీఆర్ తెదేపా ఏర్పాటు చేసి ప్రభంజనం సృష్టించినప్పటికీ ములుగు నియోజకవర్గంలో ప్రభావం చూపలేదు.

## కొత్త 'కుకునూరుపల్లి' ఎటువైపు?

సంగారెడ్డి : ఉమ్మడి కొండపాకలోని పది గ్రామాలు, జగదేవపూర్‌లోని ఐదు గ్రామాలతో సుమారు 20 వేల జనాభాతో కొత్తగా ఏర్పడిన కుకునూరుపల్లి మండల ప్రజలు.. ఈసారి కొంగొత్త రాజకీయం చూడనున్నారు. మండలం ఏర్పడిన తర్వాత తొలిసారిగా జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో కుకునూరుపల్లి మండల ప్రజలు ఎటువైపు ఉండనున్నారనే ఆసక్తి నెలకొంది. అన్ని పార్టీల ప్రచారమూ కొత్త మండల ప్రజల ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకొని సాగుతోంది. నియోజకవర్గంలోని ఇతర మండలాల కంటే విభిన్నంగా ఇక్కడ ప్రచారం ఉంటోంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు.. ఇక్కడి నియోజకవర్గ ఎమ్మెల్యేనే ముఖ్యమంత్రి అని చెబుతూ భారాస నాయకులు ప్రచారం చేస్తున్నారు. ఈసారి సీఎం కేసీఆర్.. కామారెడ్డిలోనూ పోటీ చేస్తున్నారని.. నర్సారెడ్డి స్థానికులని కాంగ్రెస్ వారు చెబుతున్నారు. కాంగ్రెస్ గెలిస్తే గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని వివరిస్తున్నారు. భాజపా తరపున పోటీ చేస్తున్న ఈటల రాజేందర్.. కుకునూరుపల్లిలో ఎక్కువగా ఉన్న బీసీ వర్గాలను ఆకట్టుకునేందుకు యత్నిస్తున్నారు. ప్రధానంగా ఈ మూడు పార్టీలు గెలుపే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో ముఖ్యంగా కొత్తగా ఏర్పడిన కుకునూరుపల్లిలో ప్రచారం చేపడుతూ ప్రజలకు సరికొత్త రాజకీయం చూపిస్తున్నారు. స్థానిక కార్యకర్తలను నాయకులను తమ పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. అటూయిటూ పార్టీల్లో చేరికలతో ఆసక్తి నెలకొంది.సరిహద్దు దారి.. కలిసుంటారు మరి అక్కన్నపేట మండలం మసిరెడ్డితండా, నంగునూర్ మండలంలోని సీతారాంతండా చూసేందుకు ఒకే గ్రామంలా కన్పిస్తాయి. అవి రెండు వేర్వేరు గ్రామాలు. మండలాలే కాదు ఏకంగా వేర్వేరు నియోజకవర్గాల్లో ఉన్నాయి. ఆ రెండు తండాల మధ్య ఉన్న రహదారి వాటిని విడదీస్తోంది. మసిరెడ్డితండాలోని ఇళ్లు, నంగునూర్ మండలంలోని గట్లమల్యాల పరిధిలోని సీతారాంతండా లోని ఇళ్లు కలిసే ఉంటాయి. అక్కడి ప్రజలంతా కలసిమెలసి పనులు చేసుకుంటారు. మసిరెడ్డితండా 2019లో ధర్మారం నుంచి విడిపోయి కొత్త పంచాయతీగా ఏర్పడింది. ఇక సీతారాంతండా గట్ల మల్యాల పరిధిలో ఉంది.

# క్షయ.. తగ్గేదెలా?



మంచిర్యాల : జిల్లాలో క్షయ(టీబీ) కేసులు పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదు. జిల్లావ్యాప్తంగా క్షయ వ్యాధిగ్రస్థులు వందల్లో బయటపడుతూనే ఉన్నారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వం ప్రాంతాలవారీగా కేసుల నమోదుకు లక్ష్యాన్ని నిర్దేశిస్తుండగా.. ప్రత్యేక శిబిరాల్లో నమూనాలు సేకరిస్తున్నారు. ఒక్కో చోట నిర్దేశిత లక్ష్యం కంటే ఎక్కువగా కేసులు నమోదవుతుండటం విశేషం. టీబీ అంతానికి 2025వ సంవత్సరం గడువుగా నిర్దేశించగా మరో పదేళ్లు ఇచ్చినా నివారణ కాదు కదా.. నియంత్రణ కూడా సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. గతంలో ఆయా బాధితులు గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉండగా ప్రస్తుతం పట్టణాల్లోనూ తీవ్రమైంది. వ్యాధిగ్రస్థులు స్వీయ జాగ్రత్తలు పాటిస్తే తగ్గుముఖం పడుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు.

బాధితుల్లో నిర్లక్ష్య ధోరణి..పొగ, గుట్కా, మద్యపాన అలవాట్లతో రోగ నిరోధక శక్తి తగ్గించుకుంటూ టీబీ బారిన పడుతున్నవారు కొందరైతే.. వ్యాధి సోకినా.. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా మరొకరికి వ్యాప్తి చేస్తున్నవారు మరికొందరు. చికిత్స పూర్తి స్థాయిలో పొందకుండా కాస్త తగ్గుముఖం పట్టగానే మందులను పక్కనపెట్టి మరింత తీవ్రం చేసుకుంటున్న వారు ఇంకొందరు. ఇలా ఏ మాత్రం బాధ్యత లేకుండా వ్యవహరిస్తూ వ్యాధి వ్యాప్తికి కారణమవుతున్నారు. కాగా సంబంధిత మందులు సైతం ఇబ్బందికరంగా ఉంటాయని, పోషకాహారాన్ని తీసుకుంటూ ఓపికతో కోర్సు పూర్తి చేయాలని వైద్యులు సూచిస్తున్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ రోగ నిరోధక శక్తిని పెంచుకునేందుకు కృషి చేయాలని చెబుతున్నారు. కరోనా సమయంలో కొవిడ్ సోకినవారు ఎలాగైతే ఒంటరిగా, జనావాసానికి దూరంగా నిత్యం మాస్క్ ధరించి ఉన్నారో క్షయ బాధితులు సైతం ఆ విధంగా వ్యవహరిస్తే ఆరోగ్యం మెరుగుపడటంతోపాటు కుటుంబ సభ్యులతోపాటు ఇతరులకు వ్యాప్తి చెందకుండా ఉంటుందనే విషయాన్ని వ్యాధిగ్రస్థులు గ్రహించాలి.

ఈ విభాగాల్లోనూ లోటుపాట్లు..

క్షయ నియంత్రణ విభాగంలో లోటుపాట్లు భారీగా ఉన్నాయి. ఎస్టీఎస్, ఎస్టీఎల్ఎస్ సిబ్బంది కొరత కొంత వెక్కిరిస్తుండగా ఉన్నవారిలోనూ కొంత నిర్లక్ష్యం కనిపిస్తుంది. నిత్యం జిల్లావ్యాప్తంగా శిబిరాలను నిర్వహించాల్సి ఉండగా.. ఆశించిన స్థాయిలో జరగడం లేదని తెలుస్తోంది. జిల్లాలోని బాధితుల వివరాలు సేకరిస్తూ వారికి అవగాహన కల్పించాల్సిన ఆయా విభాగం సిబ్బంది.. కేవలం పరీక్షలు చేయడం, నిర్ధారణ అయినవారికి మందులు ఇచ్చి పంపించడంతో తమ బాధ్యత పూర్తి అయిందనే ధోరణితో వ్యవహరిస్తున్నారు. ఈ విభాగంలో ఏళ్లుగా పాతుకుపోయిన కొంత మంది సిబ్బంది వైఖరితో లక్ష్యం నీరుగారిపోతోంది. ఇటీవల సంబంధిత శాఖకు నూతనంగా నియామకమైన పీఓతో కొంత మెరుగైన ఫలితాలు వస్తుండగా మరింత పెంచాల్సిన అవసరం కనిపిస్తుంది.ఇది జీజీహెచ్‌లోని క్షయ, ఆస్తమా తదితర వ్యాధులకు సంబంధించిన నిపుణుల గది. గత నెలలో సుమారు 13 వేల మంది బాధితులు వివిధ కారణాలతో చికిత్సకురాగా టీబీ విభాగానికి చెందినవారే ఐదు వందల మంది ఉన్నట్లు లెక్కల్లో తేలింది. ఇటీవల క్షయ కేసులు కాస్త పెరుగుతున్నాయని ఇక్కడి వైద్యులు, సిబ్బంది చెబుతున్నారు. ఎండీఆర్(టీబీ తీవ్రత ఎక్కువగా ఉన్నవారు) కేసులు సైతం బయటపడుతున్నాయని తెలుపుతున్నారు.

# బాలల ఆలోచనలకు పదును




కామారెడ్డి : బాలల ఆలోచనలకు పదునుపెట్టేలా సర్కారు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. విద్యార్థులను భావిశాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఏటా వారితో వివిధ ప్రయోగ ప్రదర్శనలు నిర్వహిస్తోంది. నవంబరు నెలలో మూడు రకాల ప్రదర్శనలు జరగనున్నాయి. రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన, బాలల సైన్స్ కాంగ్రెస్, స్కూల్ ఇన్నోవేషన్ విజ్ఞాన ప్రదర్శనల్లో విద్యార్థులు పాల్గొననున్నారు.

**జిల్లా, రాష్ట్ర స్థాయుల్లో ప్రదర్శనలు**

జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ సామాన్య, గణితం, పర్యావరణ ప్రదర్శనను ఇక నుంచి రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శనగా పిలవనున్నారు. నవంబరు చివరి వారంలో జిల్లా స్థాయిలో, డిసెంబరు మొదటి వారంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్నారు. ఆసక్తి గల విద్యార్థులు నవంబరు మూడోవారం నాటికి తమ ప్రాజెక్టులను సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది.

**వివిధ అంశాలపై..**

2023-24 విద్యా సంవత్సరంలో జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా స్థాయి ప్రదర్శన నవంబరులో జరగనుంది. ఆరోగ్యం, సంక్షేమం, పర్యావరణ వ్యవస్థను అర్థం చేసుకోవడం అంశంపై ప్రాజెక్టులు రూపొందించాలి. పర్యావరణ వ్యవస్థ, ఆరోగ్యం- పోషణ- సంక్షేమం, ఆరోగ్యం కోసం సాంస్కృతిక పద్ధతి, స్వీయ విశ్వాసం, పర్యావరణ వ్యవస్థ ఆధారిత విధానం, సాంకేతిక ఆవిష్కరణల్లో ప్రదర్శన ఇవ్వొచ్చు. ఇద్దరు సభ్యులతో కూడిన విద్యార్థుల బృందం గైడ్ పర్యవేక్షణలో ప్రాజెక్టును సిద్ధం చేయాలి.

స్కూల్ ఇన్నోవేషన్

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాలకు చెందిన పాఠశాలలు తెలంగాణ రాష్ట్ర ఇన్నోవేషన్ ఛాలెంజ్‌లో పాల్గొనేందుకు అర్హులు. ఉపాధ్యాయుడు తమ బడిలో 5 నుంచి ఏడుగురు విద్యార్థులతో బృందాన్ని ఏర్పాటు చేయాలి. నవంబరు నెలాఖరు లేదా డిసెంబరు మొదటివారంలో నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి వివరాలు ఇచ్చిన ఉపాధ్యాయులు హాజరుకావాలి. ఈ శిక్షణ అనంతరం బృందాలు రూపొందించిన నమూనాలను ప్రదర్శించాలి.

**అర్హులు వీరే..**

ఉభయ జిల్లాల్లో నిర్వహించే ఈ మూడు వైజ్ఞానిక ప్రదర్శనల్లో అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల విద్యార్థులు పాల్గొనే అవకాశం కల్పించారు. 6 నుంచి 12వ తరగతి వరకు చదివే వారు ఈ పోటీల్లో పాల్గొనాలని ఎస్‌సీఈఆర్‌టీ ప్రకటించింది.

ఎంపికైతే ప్రశంసాపత్రాలు..

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎస్‌సీఈఆర్‌టీ, విశ్వేశ్వరయ్య టెక్నాలజీ సంయుక్తంగా ఈ వైజ్ఞానిక ప్రదర్శనలను నిర్వహిస్తారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థుల ప్రదర్శన అంశాలను ఎస్‌సీఈఆర్‌టీ శాస్త్రవేత్తల సహకారంతో అభివృద్ధి చేస్తారు. జాతీయ స్థాయిలో ప్రతిభ చాటినవారికి ఢిల్లీలో రాష్ట్రపతి, మానవ వనరుల శాఖ మంత్రి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకోనున్నారు.

అవకాశం సద్వినియోగం చేసుకోవాలి

- సిద్దిరాంరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి

నవంబరులో జరిగే వైజ్ఞానిక మేళాలను ఆసక్తిగల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. విద్యార్థులు తమ ప్రతిభను చాటేందుకు ఇదొక చక్కటి అవకాశం. దీనికి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బాధ్యత వహించాలి. నూతన ఆవిష్కరణలు రూపొందించేలా గైడ్ ఉపాధ్యాయులు విద్యార్థులను మార్గనిర్దేశం చేయాలి.

# భూముల రిజిస్ట్రేషన్లపై ఎన్నికల ప్రభావం

కరీంనగర్ : తహసీల్దార్ కార్యాలయాల్లో జరిగే వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లపై ఎన్నికల నామినేషన్ల దాఖలు ప్రభావం పడింది. నియోజకవర్గ కేంద్రంలో ఉన్న ఈ కార్యాలయాల్లో నామినేషన్లు ముగిసే వరకు చేయొద్దని మౌఖిక ఆదేశాలు చేయడంతో అక్కడ దాదాపు నిలిచిపోయాయి. ఇక మిగతా మండల కేంద్రాల్లో అయితే నగదు లావాదేవీల ఇబ్బంది కారణంగా తక్కువ మొత్తంలో అవుతున్నాయి.

రెవెన్యూ సిబ్బందికి విధులు..

సాధారణంగా ప్రతి నియోజకవర్గ పరిధిలో మూడు నుంచి ఆరు మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల పరిధిలోని రెవెన్యూ సిబ్బంది తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్లకు నామినేషన్ల బాధ్యతలు అప్పగిస్తున్నారు. వారంతా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు అక్కడే సమయాన్ని కేటాయిస్తున్నారు. నామపత్రాలు సరి చూడడం, అభ్యర్థులకు సూచనలు ఇవ్వడం, డిపాజిట్లు స్వీకరించడం తదితర బాధ్యతలు చూస్తున్నారు. మిగిలిన కొంత సమయం ఇతర విధులు నిర్వర్తిస్తున్నారు. కరీంనగర్ వంటి జిల్లా కేంద్ర నియోజకవర్గంలో తక్కువ మండలాలు ఉంటున్నాయి. ఇక్కడ అవసరాన్నిబట్టి తహసీల్దార్లతోపాటు నగర పాలక సంస్థ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ సేవలు వినియోగించుకుంటున్నారు.

నగదు లావాదేవీలకు ఇబ్బంది..

భూముల కొనుగోళ్లు కూడా తగ్గాయి. అధిక మొత్తంలో నగదు లావాదేవీలు జరపడానికి వీల్లేదు. డబ్బు తీసుకురావడం, ఇవ్వడం వంటి వాటికి లెక్కపక్కాగా ఉండాలి. జీరో పద్ధతిలో వెళ్లే వారికి సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో కొందరు రిజిస్ట్రేషన్లు వాయిదా వేసుకుంటున్నారు. స్లాట్స్ బుక్ చేసుకున్న వారికి తప్పనిసరి పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు ఒక అధికారి తెలిపారు.

# ఎన్నికల పండుగ.. ఉపాధి నిండుగా

జహీరాబాద్ : ఎన్నికల పండుగొచ్చింది. ఏ గ్రామంలో చూసినా డప్పు చప్పుళ్లు, డీజేలతో ర్యాలీలు, నాయకుల ఆటపాటలతో సందడే కనిపిస్తోంది. వివిధ పార్టీల ప్రచారం హోరెత్తుతోంది. ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికలు కావడంతో అన్నీ పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ప్రచారంలో తగ్గేది లేదంటున్నాయి. ఎంత ఖర్చయినా భరిస్తామంటున్నాయి. అయితే ఈ ఎన్నికల పుణ్యమా అని చాలా మందికి ఉపాధి దొరికింది. మరి ఏఏ రంగాల వారికి ఉపాధి లభిస్తుందో కథనం.

**గ్రామాల్లో ప్రచారం చేసేందుకు..**

గ్రామాల్లో అభ్యర్థులు ప్రచారం చేసేందుకు వస్తుంటారు. ఇందులో చాలా మంది మహిళలు, ప్రజలు అవసరం ఉంటుంది. వారు ముందు నడుస్తుంటే వెనకాల అభ్యర్థితో పాటు అనుచరగణం నడుచుంటూ లేక ప్రచార రథంతో వస్తుంటారు. ముఖ్యంగా మహిళలు మెడలో కండువాలు వేసుకొని బతుకమ్మలు, బోనాలను ఎత్తుకొని ముందుకు సాగుతుంటారు. ఇందులో వారికి నాలుగైదు గంటలకు రూ.200 వరకు ఇస్తున్నారు. ఇక బతుకమ్మలు, బోనాలు చేసిన వారికి ఇంకొంచెం ఎక్కువగా డబ్బులు ఇస్తున్నారు. వారే అన్ని పార్టీల ప్రచారాలకు వెళున్నారు. ఇలా నెల రోజుల పాటు ఉపాధి లభిస్తుంది. ఇలా ఉమ్మడి జిల్లాలో మెదక్, నర్సాపూర్, చేగుంట, రామాయంపేట, సిద్దిపేట, గజ్వేల్, సంగారెడ్డి తదితర మండలాల్లో ఇలాంటి పరిస్థితి ఉంది. పట్టణాల్లో ఎక్కువగా, పల్లెల్లో కొంత తక్కువగా తీసుకుంటున్నారు.

**పూలకు భలే గిరాకీ**

ప్రచారంలో పాల్గొనేందుకు అభ్యర్థులు వచ్చినప్పుడు పూలదండలు, శాలువలతో స్వాగతం పలుకుతున్నారు. ప్రస్తుతం బంతిపూలకు భలే గిరాకీ ఉంది. చేగుంట, గజ్వేల్, దౌల్తాబాద్, వర్గల్‌తో పాటు ఉమ్మడి జిల్లాలో బంతిపూల సాగు ఎక్కువగా ఉంది. ఈ పూలను కిలోకు రూ.50 నుంచి రూ. 100 వరకు విక్రయిస్తున్నారు. గ్రామాలకు అభ్యర్థులు వస్తే పూలు చల్లుతూ తమ అభిమానాన్ని చాటుతున్నారు. పూల కోసం ఒక్కో గ్రామంలో రూ.5 వేల వరకు ఖర్చు చేస్తుండటం గమనార్హం.

డప్పు వాయిస్తే..

గ్రామంలో డప్పులతో ప్రచారాలే ఎక్కువగా ఉంటాయి. స్థానికంగా డప్పు వాయించే వారినే పిలిపిస్తున్నారు. ఒక్కొక్కరికి రూ.500 ఇస్తామని ప్రచారం చేసేందుకు తీసుకొస్తున్నారు. ఒక్కో పార్టీకి చెందిన అభ్యర్థి ఒకటి, రెండు సార్లు గ్రామానికి వస్తుంటారు. అప్పుడు వీరి సేవలను వినియోగించుకుంటున్నారు.అలాగే బ్యాండ్ మేళం వాళ్లకు కూడా ఉపాధి లభిస్తోంది.

కళాబృందాలకు..

ప్రచారంలో జానపద కళాబృందాలు చేసే జోష్ అంతాఇంతా కాదు. ఒక గ్రామంలో అభ్యర్థి ప్రచారం చేస్తుంటే కళాబృందం ఇంకో గ్రామం వెళ్తుంది. వారు గ్రామంలో పార్టీ, అభ్యర్థుల గురించి పాటలు పాడుతూ నృత్యం చేస్తుంటారు. వారి పాటలను, నృత్యాలను గ్రామస్థులు, మహిళలు ఆసక్తిగా చూస్తూ వింటుంటారు. ఇలా ఈ కళాబృందాలకు ఎన్నికల కంటే రెండు రోజుల వరకు ఉపాధి లభిస్తుంది. ఒక్కో బృందంలో ఎనిమిది నుంచి పది మంది వరకు ఉంటారు. ఒక్కో పార్టీకి మూడు, నాలుగు బృందాలు ఉంటాయి. ఎన్నికల వేళ వీరు ప్యాకేజీలు మాట్లాడుకుంటున్నారు.

టెంట్ హౌస్ నిర్వాహకులకు

ఎన్నికల సమయంలో పార్టీల కార్యకర్తలు, నాయకులకు ప్రతి రోజు తప్పకుండా భోజనాలు వండి పెడుతుండాలి. ఇందుకోసం వంట సామగ్రి అవసరం ఉంటుంది. అలాగే టెంట్ కూడా వేయాల్సి ఉంటుంది. ఇందుకోసం స్థానికంగా ఉన్న టెంట్‌హౌస్ నుంచి వస్తువులు తీసుకెళ్తుంటారు. వీరికి కనీసం 15 రోజుల పాటు ఉపాధి లభిస్తుంది. అంతేకాకుండా వీరి వద్ద ఉండే డీజే సిస్టంను కూడా ప్రచారానికి తీసుకెళ్తున్నారు. కుర్చీకి రూ.10, టెంటు సైజును బట్టి రూ. వెయ్యి నుంచి రూ.4 వేల వరకు తీసుకుంటున్నారు. స్టేజీ నిర్మాణానికి రూ. 7 వేల వరకు, భోజనం కోసం వినియోగించే వంట పాత్రలకు కిలోకు రూ.20 చొప్పున లెక్కించి తీసుకుంటున్నారు. సైడ్‌వాల్, గ్రీన్‌మ్యాట్ ఇలా ఒక్కో దానికి రూ. 200 నుంచి రూ. 250 వరకు వసూలు చేస్తున్నారు. ఇక ఫంక్షన్ హాళ్లకు కూడా గిరాకీ ఎక్కువగానే ఉంది. ముందే పెళ్లిల సీజన్, దానికి తోడు పార్టీ సమావేశాలకు ఫంక్షన్ హాళ్లు కూడా అవసరం ఎక్కువగా కావడంతో డిమాండు పెరిగింది. ఇక వంట చేసేవారికి కూడా రోజుకు రూ.500 వరకు వస్తోంది.

## ఎన్నికల సమరం.. నిర్వహణే కీలకం

జహీరాబాద్ : ఎన్నికల నిర్వహణ ఆషామాషీ వ్యవహారం కాదు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇది అత్యంత కీలకమైనది. ఇందుకోసం తగిన రీతిలో కసరత్తు చేసి ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాల్సి ఉంటుంది. ఢిల్లీ నుంచి గల్లీ స్థాయి అధికారులు ఈ ప్రక్రియలో భాగస్వాములు కావాల్సిందే. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తేనే పోలింగ్ నుంచి మొదలుకొని లెక్కింపు వరకు ప్రక్రియ సజావుగా కొనసాగుతుంది. తమకు అప్పగించిన బాధ్యతలను నిష్పాక్షపాతంగా నిర్వహిస్తే ఎన్నికలు పారదర్శకంగా జరుగుతాయి. ఎన్నికల ప్రక్రియలో కొందరు కీలక బాధ్యతలను నిర్వర్తిస్తారు.. వారెవరంటే.!

బూత్ స్థాయి అధికారులు(బీఎల్‌వోలు)

ఎన్నికల నిర్వహణ ప్రక్రియ ప్రారంభానికి ముందు, తర్వాత బీఎల్‌వోలు కీలకంగా వ్యవహరిస్తారు. అర్హులైనవారు ఓటరు జాబితాలో ఉండేలా వీరు చూస్తారు. కొత్త ఓటరు నమోదుతో పాటు మార్పులు, చేర్పులు, తొలగింపునకు దరఖాస్తులు స్వీకరించి, జాబితా తయారీలో అధికారులకు తమవంతుగా సహకారం అందిస్తారు..

జిల్లా ఎన్నికల అధికారి..ఎన్నికల నిర్వహణలో పాలనాధికారి జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారు. ఎన్నికల ప్రక్రియలో అధికారులకు విధుల కేటాయింపు మొదలుకొని వారికి శిక్షణ ఇచ్చే కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు. ప్రతిరోజూ సమీక్షలు నిర్వహించి అధికారులకు దిశానిర్దేశం చేస్తారు. ఓటరు జాబితా తయారీ నుంచి ఓట్ల లెక్కింపు వరకు జిల్లా ఎన్నికల అధికారిదే బాధ్యత..రిటర్నింగ్..ఎన్నికల జరిగే ప్రతి నియోజకవర్గానికి ఒక రిటర్నింగ్ అధికారిని ఎన్నికల సంఘం నియమిస్తుంది. ఆర్వోలు తమ పరిధిలో జరిగే ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు మొదలుకొని అభ్యర్థుల నామినేషన్ స్వీకరణ, పరిశీలన, తిరస్కరణ చేస్తారు. అభ్యర్థుల తుది జాబితా ప్రకటన, సిబ్బంది నియామకం, వారికి నిర్వహించే శిక్షణ, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడివరకు బాధ్యత ఆర్వోదే..

సెక్టోరియల్..పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించే బాధ్యత సెక్టోరియల్ అధికారిపైనే ఉంటుంది. ర్యాంపుల ఏర్పాటు, విద్యుత్తు, తాగునీరుతో పాటు మౌలిక వసతులు కల్పించేలా చేస్తారు. ఒక్కో అధికారికి ఆరు పోలింగ్ కేంద్రాలు ఉంటాయి. పోలింగ్ కేంద్రాలతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాలి. పోలింగ్ సమయంలో ఎలాంటి పొరపాటు జరిగినా బాధ్యత వహించాల్సి ఉంటుంది.ప్రిసైడింగ్..ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక ప్రిసైడింగ్ అధికారి ఉంటారు. పోలింగ్‌కు అవసరమైన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, ఇతర సామగ్రి తీసుకొస్తారు. కేటాయించిన పోలింగ్ కేంద్రం పూర్తి బాధ్యత ఆయనదే. ఓటింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలను బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూమ్‌కు తరలిస్తారు.

# ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

ఖమ్మం : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ప్రారంభమైంది. ఎంపీసీ, బైపీసీ విద్యార్థుల కోసం ఎంసెట్, జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌తో పాటు నీట్, అగ్రికల్చర్, బి.ఫార్మసీ, నర్సింగ్ తదితర కోర్సుల్లో ప్రవేశాల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం జిల్లాలో ప్రతి కళాశాలకు రూ.60 వేల చొప్పున మొత్తం 19 కళాశాలలకు కలెక్టర్ గౌతమ్ నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో అవసరమైన శిక్షణ సామగ్రి (పుస్తకాలు)ని ఇప్పటికే కొనుగోలు చేసి ఆయా కళాశాలలకు అందజేశారు. ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలతో పాటు ఇతర ప్రవేశాల కోసం విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నారు. వార్షిక పరీక్షలు పూర్తయిన తర్వాత జిల్లా కేంద్రంలో బాలబాలికలకు సెలవుల్లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వాలనే యోచనలో



జిల్లా ఉన్నతాధికారులు ఉన్నారు. గత ఏడాది ఇచ్చిన శిక్షణ వల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే వందలాది మంది విద్యార్థులు మంచి కోర్సుల్లో చేరే అవకాశం లభించింది. నలుగురు విద్యార్థులు ఏకంగా ఎంబీబీఎస్ కోర్సుల్లో చేరడం విశేషం.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సైన్స్ విద్యార్థుల కోసం ప్రత్యేక శిక్షణను ప్రారంభించాం. ప్రతి కళాశాలను సందర్శించి శిక్షణ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నాం. శిక్షణ పొందుతున్న విద్యార్థులకు సంబంధించిన ప్రగతిని ఎప్పటికప్పుడు నమోదు చేసి జిల్లా కార్యాలయానికి పంపిస్తాం. గత ఏడాది కన్నా ఈసారి మరింత మంది విద్యార్థులకు ప్రవేశాలు లభించేలా కృషి చేయాలని సంబంధిత ప్రిన్సిపల్స్‌కు సూచించాం.

# ఓటు పోటెత్తేలా!!

మహబూబాబాద్ : ఓటు హక్కు వినియోగంతో ప్రజాస్వామ్యం బలోపేతమవుతుంది. వజ్రాయుధాన్ని సమర్థంగా వినియోగిస్తేనే మంచి భవిష్యత్తు కోసం పనిచేసే నాయకులు ఎన్నికవుతారు. ఏ మాత్రం అలసత్వం వహించినా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఆందోళన కలిగించే విషయమేంటంటే పల్లె ఓటర్లకన్నా పట్టణవాసులు ఓటు వేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. 2014, 2018లో జరిగిన ఎన్నికల్లో నియోజకవర్గాల వారీగా ఓటింగ్ శాతాన్ని పరిశీలించిన ఎన్నికల యంత్రాంగం ఈసారి మరింత పెంచేందుకు దృష్టి సారించింది. స్వీప్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున చైతన్య కార్యక్రమాలు చేపడుతోంది. ఈనెల 30న జరిగే పోలింగ్ రోజున అందరూ బాధ్యతగా ఓటు వేయడానికి కేంద్రాల వైపు నడవాలి.

సెల్ఫీ పాయింట్ పట్టణాల్లో ఎన్నికల అధికారులు వీవీప్యాట్, ఈవీఎం, బ్యాలెట్ నమూనాలను ఏర్పాటు చేశారు. వాటి వద్ద సెల్ఫీ ఫొటోలు దిగేలా సదుపాయం కల్పించారు. ఇలా చేయడం వల్ల ఓటరు పోలింగ్ రోజు కేంద్రాలకు వెళ్తారని.. హక్కును వినియోగించుకుంటారని అధికారులు భావిస్తున్నారు.

కళా ప్రదర్శన ఓటు ఆవశ్యకతపై తెలంగాణ సాంస్కృతిక మండలి కళాకారులు ఊరూరా..పట్టణాల్లో ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. కళాకారులు ప్రధాన కూడళ్లలో, జన సంచారం ఉండే ప్రాంతాల్లో ఓటరు చైతన్య గీతాలను ఆలపిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా 2కే రన్, ఓటు విలువను తెలుపుతూ ప్లకార్డులతో ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు.


చైతన్య గీతాలతో ఓటర్ల చైతన్య గీతాల సీడీలను ఆవిష్కరిస్తున్నారు. మహబూబాబాద్ జిల్లాలో గిరిజన, కోయ భాషల్లో, తెలుగు భాషల్లోనూ ఆయా వర్గాల వారికి అర్థమయ్యేలా పాటలను రాయించి..పాడించి సీడీలను తయారు చేయించారు. ఆ పాటలతో ఓటు చైతన్య రథాల ద్వారా ఊరూరా ప్రచారం చేస్తున్నారు.

అంబాసిడర్లు యువ ఓటర్లను చైతన్య పరిచేందుకు నియోజకవర్గానికి కొంత మందిని కళాశాల అంబాసిడర్లుగా నియమించారు. డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో ఆసక్తి, అభిరుచి ఉన్న విద్యార్థులను గుర్తించి వారితో విద్యాసంస్థల్లో ఓటు నమోదు.. ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రాణిస్తున్న యువ ఓటర్లను గుర్తించి యూత్ ఐకాన్‌గా నియమించి.. అవగాహన కల్పిస్తున్నారు.

# అడుగంటిన భూగర్భ జలాలు.. ఎండుతున్న పంటలు

దామరచర్ల : వర్షాభావం, సాగర్ నీరు కాలువ చివరి భూములకు అందకపోవడంతో దామరచర్ల మండలంలో వందలాది ఎకరాల వరి, పత్తి, మిర్చి పంటలు ఎండిపోతున్నాయి. సాగర్ ప్రాజెక్టు లో సరిపడా నీరు లేనందున రైతులు చెరువులు, బోర్ల ఆధారంగా వరితో పాటు మెట్టపైర్లను సాగు చేశారు. సకాలంలో వర్షాలు కురవక పోవడంతో బోర్లు వట్టిపోయాయి. ఫలితంగా పొట్టదశలో ఉన్న వరి పైరు నీరందక ఎండిపోయింది. దామరచర్ల బైరవానిచెర్వు కింద సుమారు 200 ఎకరాల వరి పంటకు నష్టం జరిగింది. చెరువులు నింపేందుకు పదిరోజుల క్రితం వజీరాబాద్ మేజర్‌కు నీరు విడుదల చేయగా నీరు బొత్తలపాలెం ఊరచెర్వు వరకు మాత్రమే వచ్చింది. దామరచర్లలోని రెండు ప్రధాన చెర్వులకు చుక్కనీరు రాకపోవడంతో వట్టిపోయాయి .సాగునీరు లేక రైతులు నష్టపోగా ఇళ్లలో ఉన్న బోర్లు సైతం పనిచేయడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కల్లేపల్లిలో సుమారు 200 ఎకరాలలో రైతులు మిర్చి పైరు వేయగా పిందె దశలో నీరులేక చెట్లు వాడిపోయినట్లు రైతులు తెలిపారు. టీవీగూడెం, వీర్లపాలెం తదితర గ్రామాలలో రైతులు పత్తి సాగు చేయగా ప్రస్తుతం కాయదశలో ఉన్న పైర్లకు నీరు లేక పంటను వదిలేశారు. మండల వ్యాప్తంగా వేయి ఎకరాలకు పైగా పంటనష్టం జరిగినట్లు రైతులు తెలిపారు. ఎకరా పైరుకు రూ.50 వేలు పెట్టుబడి పెట్టి నష్టపోయినట్లు రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం దామరచర్ల, నర్సాపురం, టీవీగూడెం తదితర గ్రామాలలో చెర్వులు వట్టిపోయాయని సాగర్‌నీటితో నింపాలని రైతులు కోరుతున్నారు.

# అయితే అసెంబ్లీ.. లేదంటే పార్లమెంట్



ఖమ్మం : అయితే అసెంబ్లీ ఎన్నికలు, లేదంటే పార్లమెంట్ బరిలో నిలిచే అభ్యర్థులే ఎక్కువ. కానీ శాసనసభ, పార్లమెంట్ స్థానాల్లో రెండింట పోటీ చేసిన అభ్యర్థులు జిల్లాలో పలువురు ఉన్నారు. మరి వారెవరో ఒకసారి చూద్దామా..శాసనసభ, పార్లమెంట్ సభ్యులుగా జిల్లా నేతలు తెళ్ల లక్ష్మీకాంతమ్మ (కాంగ్రెస్): 1957 ఎన్నికల్లో ఖమ్మం అసెంబ్లీ ద్విసభ్య నియోజకవర్గం నుంచి జనరల్ స్థానం అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1962, 1967, 1971 ఎన్నికల్లో ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి వరుసగా మూడుసార్లు ఎంపీగా హ్యాట్రిక్ విజయం సాధించారు. 1978లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హిమాయత్‌నగర్ అసెంబ్లీ స్థానం నుంచి జనతా పార్టీ తరపున పోటీ చేసి గెలుపొంది మరోసారి అసెంబ్లీకి వెళ్లారు.

నల్లమల గిరిప్రసాద్(సీపీఐ): ఖమ్మం అసెంబ్లీ నుంచి 1962 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1984లో ఖమ్మం లోక్‌సభ స్థానంలో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతరం 1992 నుంచి 1997 వరకు రాజ్యసభ సభ్యుడిగా చేశారు. రాజ్యసభ సభ్యుడిగా 1997 మే 24 తేదీన మరణించారు.జలగం కొండలరావు(కాంగ్రెస్): 1957 ఎన్నికల్లో వేంసూరు అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1977, 1980లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి గెలుపొంది పార్లమెంటులో ప్రవేశించారు.

కోనేరు నాగేశ్వరరావు: 1983, 1985, 1994 ఎన్నికల్లో కొత్తగూడెం అసెంబ్లీ స్థానం నుంచి తెదేపా అభ్యర్థిగా గెలుపొందారు. 1996లో ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి తెదేపా (లక్ష్మీపార్వతి) పార్టీ తరపున పోటీ చేసి ఓడిపోయారు.

నామా నాగేశ్వరరావు 2004 ఎన్నికల్లో ఖమ్మం లోక్‌సభ స్థానంలో తెదేపా నుంచి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి రేణుకాచౌదరి చేతిలో ఓడిపోయారు. 2009లో తెదేపా నుంచి ఇదే స్థానంలో తెదేపా నుంచి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి రేణుకా చౌదరిపై విజయం సాధించారు. 2014లో తెదేపా నుంచి పోటీ చేసిన ఆయన వైకాపా అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతిలో ఓడిపోయారు. 2018లో ఖమ్మం అసెంబ్లీ స్థానం నుంచి తెదేపా తరపున ఎమ్మెల్యేగా పోటీ చేసిన ఆయన తెరాస అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ చేతిలో ఓటమి చవిచూశారు. ఆ తర్వాత తెరాసలో చేరిన ఆయన 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం నుంచి ఎంపీగా గెలుపొందారు.

చేకూరి కాశయ్య: 1972 ఎన్నికల్లో పాల్వంచ అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేసి గెలుపొందారు. 1978 ఎన్నికల్లో కొత్తగూడెం అసెంబ్లీ స్థానం నుంచి విజయం సాధించారు. 1983 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా కొత్తగూడెం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 1971 పార్లమెంటు ఎన్నికల్లో ఖమ్మం లోక్‌సభ స్థానంలో పోటీ చేసి ఓడిపోయారు.

పొంగులేటి శ్రీనివాసరెడ్డి: పొంగులేటి శ్రీనివాసరెడ్డి 2014లో వైకాపా తరపున ఖమ్మం ఎంపీగా గెలుపొందారు. తాజాగా పాలేరులో కాంగ్రెస్ తరపున బరిలో దిగుతున్నారు.

జలగం వెంగళరావు (కాంగ్రెస్): 1962, 1967, 1972 ఎన్నికల్లో వేంసూరు అసెంబ్లీ స్థానం, 1978లో సత్తుపల్లి అసెంబ్లీ స్థానం నుంచి గెలుపొంది అసెంబ్లీకి వెళ్లారు. హోం శాఖ మంత్రిగా, రాష్ట్ర ముఖ్యమంత్రిగా సేవలందించారు. 1984, 1989 ఎన్నికల్లో జలగం వెంగళరావు ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి వరుసగా విజయం సాధించి కేంద్ర మంత్రిగా చేశారు.

తమ్మినేని వీరభద్రం (సీపీఎం): 1991, 1996, 1998లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో వరుసగా ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేశారు. 1996లో విజయం సాధించారు. మిగతా రెండు ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. 18 నెలల కాలం ఎంపీగా పని చేశారు. 2004 లో శాసనసభ ఎన్నికల్లో ఖమ్మం స్థానం నుంచి గెలుపొందారు.

నాదెండ్ల భాస్కర్‌రావు: 1983లో వేమూరు నియోజకవర్గంలో తెదేపా అభ్యర్థిగా విజయం సాధించారు. 1989లో తెనాలిలో గెలుపొందారు. 1998 పార్లమెంటు ఎన్నికల్లో ఖమ్మం లోక్‌సభ స్థానంలో ఎంపీగా గెలుపొందారు.మంచికంటి రాంకిషన్‌రావు(సీపీఎం): 1967 ఎన్నికల్లో ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 1983, 1985 అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం ఎమ్మెల్యేగా గెలుపొందారు.

శాసన సభ్యుల్లో చిన్నాపెద్ద..!

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు 15 సార్లు శాసన సభకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో గెలుపొందిన వారిలో పెద్ద వయసు కలిగిన ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు కాగా ... అతి పిన్న వయసు శాసన సభ్యురాలిగా బానోతు చంద్రావతి నిలిచారు. వనమా వెంకటేశ్వరరావు 2018 ఎన్నికల బరిలో కొత్తగూడెం అభ్యర్థిగా నిలిచినప్పుడు వయస్సు 73 సంవత్సరాలు. 1944 నవంబరు 1న ఆయన జన్మించారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లోనూ వనమా భారాస తరపున పోటీ చేస్తున్నారు. ఇక అతి పిన్న వయస్కురాలిగా వైరా నియోజకవర్గం నుంచి 2009లో గెలుపొందిన బానోతు చంద్రావతి నిలిచారు. ఆమె 1983 ఆగస్టు 31న జన్మించారు. 2009 ఎన్నికైనప్పుడు ఆమె వయస్సు 26 సంవత్సరాలు. మధిర

ఓటు లేకున్నా... మాటామంతి!

సీఎల్పీ నేత, మధిర ఎమ్మెల్యే, కాంగ్రెస్ అభ్యర్థి మల్లు భట్టి విక్రమార్క ముదిగొండ మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పమ్మి గ్రామంలో రహదారి పక్కన చెట్టుకింద కూర్చున్న చిన్నారులను చూసి వారివద్దకు వెళ్లి మాట్లాడారు. వారి పేర్లు, ఏం చదువుతున్నారని అడిగి తెలుసుకున్నారు. బాగా చదువుకోవాలని సూచించారు. చిన్నారులు ఉత్సాహంగా భట్టితో కరచాలనం చేశారు. ముదిగొండ

సీఎం బస్సైనా తనిఖీ తప్పదు!

కొత్తగూడెంలో ఆదివారం జరిగిన 'ప్రజా ఆశీర్వాద సభ'కు హాజరయ్యేందుకు సీఎం కేసీఆర్ హెలికాప్టర్‌లో వచ్చారు. ఆయన ప్రగతి మైదానంలో దిగి.. అక్కడ్నుంచి ప్రకాశం మైదానికి వెళ్లారు. ఆ సమయంలో సీఎం ప్రయాణించిన ప్రత్యేక బస్సు(ప్రగతి పథం)ను కొద్ది నిమిషాల ముందు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి రాకేశ్, ఆదాయ పన్ను శాఖ అధికారి ఆనంద్, కానిస్టేబుల్స్‌తో కూడిన బృందం క్షుణ్ణంగా తనిఖీ చేసింది. బస్సు ప్రైవేటు వాహనం కాబట్టి ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం తనిఖీ చేసినట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తెలిపారు. ఈ నివేదికను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక అలకు పంపనున్నట్లు పేర్కొన్నారు.

మూడోసారి మోసం చేసేందుకు వస్తున్నారు: తుమ్మల

మూడోసారి మోసం చేసేందుకు భారాస అభ్యర్థులు వస్తున్నారని మాజీ మంత్రి, ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. త్యాగాలతో తెచ్చుకున్న తెలంగాణలో కేసీఆర్ శివలింగం మీద తేలులా కూర్చున్నారని ఎద్దేవా చేశారు. ఓట్లతో ఆ తేలును తొలగించాలని పిలుపునిచ్చారు. ఖమ్మం ఎస్ఆర్ కన్వెన్షన్ హాలులో ఆదివారం పాలేరు నియోజకవర్గ పరిధిలోని ఖమ్మం గ్రామీణ మండల కాంగ్రెస్ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. తుమ్మల మాట్లాడుతూ... ఖమ్మం జిల్లాలో ఒక్క ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుడు కూడా గెలవనప్పుడు, జెండా పట్టే దిక్కులేనప్పుడు వీరు రావాలని పిలిచి మరీ తనను, పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ముఖ్యమంత్రి కేసీఆర్ తన పార్టీలో చేర్చుకున్నారని చెప్పారు. 2014 ఎన్నికల ప్రచారానికి ఖమ్మం వచ్చినపుడు మనుషులు లేక మైదానం నుంచే కేసీఆర్ హెలికాప్టర్ ఎగిరి పోయిందని ఎద్దేవా చేశారు. పాలేరులో భారాస అభ్యర్థి మైకు పట్టుకుంటే మూడు నిమిషాలు కూడా మాట్లాడలేదని ఎద్దేవా చేశారు. పాలేరు అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కళ్లెం వెంకటరెడ్డి, ఎన్నికల ఇన్‌ఛార్జి శ్రీనివాసరెడ్డి, నాయకులు రాయల నాగేశ్వరావు, స్వర్ణకుమారి, బాలసాని లక్ష్మీనారాయణ, రాంరెడ్డి చరణ్‌రెడ్డి, రాధాకిశోర్, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

పొత్తు చర్చల్లో కాంగ్రెస్ మోసం: సీపీఎం

పొత్తు పెట్టుకుందామని ఆహ్వానించిన కాంగ్రెస్ చివరకు తమను మోసం చేసిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ ఆరోపించారు. వైరాలో పార్టీ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని బొంతు రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. కాంగ్రెస్ జాతీయ నాయకత్వమే రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంకు ఫోన్ చేసి పొత్తులు పెట్టుకుంటామని అడగడంతోనే పొత్తులకు ప్రయత్నించామన్నారు. తాము అడిగిన స్థానాలు ఇవ్వకుండా కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. భాజపాను ఓడించడమే తమ లక్ష్యమన్నారు. 10న వైరా సీపీఎం అభ్యర్థి నామినేషన్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల కార్యదర్శులు నున్నా నాగేశ్వరరావు, అన్నవరపు కనకయ్య, రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీకాంత్, అభ్యర్థి భూక్యా వీరభద్రం, సత్యనారాయణ, కృష్ణ, సుధాకర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఓటు వేయకుంటే కఠిన శిక్షలు

మన దేశంలో నిర్లిప్తత

అసలు ఓటు హక్కే లేని పరిస్థితి నుంచి ఒక వ్యక్తి ఒక ఓటు స్థాయికి వచ్చాం. కానీ ఎంతో విలువైన ఓటును వినియోగించుకోవడంలోనూ కొంతమంది నిర్లిప్తత ప్రదర్శిస్తున్నారు. కానీ చాలా దేశాల్లో ఓటు వేయకుంటే కఠిన శిక్షలు ఉన్నాయని మీకు తెలుసా..

ఇంగ్లండ్: యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఇంగ్లండ్, స్కాట్లాండ్, వేల్స్, ఉత్తర ఐర్లాండ్ దేశాలుంటాయి. ఏదైనా కారణాలతో స్థానిక ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకోకుంటే క్రిమినల్ చర్యలు తీసుకుంటారు. ఓటరుగా నమోదు కాకపోయినా, ఉన్న ఓటు వినియోగించుకోకున్నా 80 నుంచి 1000 పౌండ్లు వరకు జరిమానా విధిస్తారు.

దక్షిణ ఆఫ్రికా: ఈ దేశంలో ఓటుహక్కు వినియోగించుకోనివారిపై దశల వారీగా చర్యలు తీసుకుంటారు. మొదట నోటీసు పంపుతారు. స్పందించకుంటే రెండో దశలో 70 డాలర్లు జరిమానాతో పాటు నోటీసు వస్తుంది. మూడో దశలో మరింత అదనంగా జరిమానా విధిస్తారు. నాలుగో దశలో ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో అధికారుల బృందం వాహనాలు జప్తు చేసి తీసుకెళతారు.

ఆస్ట్రేలియా: ఈ దేశాన్ని అధికారికంగా కామన్వెల్త్ ఆఫ్ ఆస్ట్రేలియాగా పిలుస్తారు. 1924 ఓటు నిబంధనలు కఠినతరం చేశారు. రాష్ట్రస్థాయి ఎన్నికల్లో ఓటు వినియోగించని వారికి మొదటిసారి 20 డాలర్లు, గతంలో జరిమానా చెల్లించని వారికి 50 డాలర్లు జరిమానా విధిస్తారు.

బెల్జియం: నిర్బంధ ఓటింగ్ అమలులో ఉంది. ఎన్నికల సమయంలో ఆ దేశ ప్రజలతో పాటు విదేశీయులున్నా తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలి. ఓటు వేయకుంటే న్యాయ విచారణ ఎదుర్కోవాల్సి ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగం పొందాలంటే ఇబ్బందులు ఎదురవుతాయి.

బొలీవియా: సాధారణ ఎన్నికల్లో వేయకపోతే కఠిన చర్యలు తీసుకుంటారు. ఎన్నికలు ముగిసిన మూడు నెలల తర్వాత తాము ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ప్రజలు రుజువు చేసుకోవాలి. లేకుంటే బ్యాంకు నుంచి నెల వారీ జీతం సొమ్ము నిలిపివేస్తారు.

గ్రీస్: ఆగ్నేయ ఐరోపాలో చిన్న దేశం. ఇక్కడ ఓటు హక్కు వినియోగించుకోకపోతే పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్ పొందటం చాలా కష్టతరం అవుతుంది.

# వరి రైతులకు వర్ష భయం

ఖమ్మం : ఖరీఫ్‌లో వ్యయప్రయాసలుకోర్చి వరి సాగుచేస్తే ధాన్యం చేతికొచ్చే సమయంలో ప్రకృతి కన్నెర్ర చేస్తోంది. పంట కీలక దశలో సాగు నీరందక అష్టకష్టాలు పడ్డారు. కొద్దిరోజులుగా ఆకాశం మేఘావృతం కావడం, మూడు రోజుల క్రితం వర్షం పడటంతో అన్నదాతలు బెంబేలెత్తుతున్నారు. అశ్వారావుపేట, ఏపీ సరిహద్దు గ్రామాల్లో వర్షం కురిసింది. వర్షం కురిస్తే వరి, పత్తి రైతులు నష్టపోయే పరిస్థితి అధికంగా ఉంది. మిరప పంటకు వర్షం అనుకూలమని, ఆలస్యంగా సాగుచేసిన వరిపంటకు కూడా ఉపయోగమని రైతులు చెబుతున్నారు.ముమ్మరంగా వరి కోతలు..సత్తుపల్లి, వైరా నియోజకవర్గ వ్యాప్తంగా వరికోతలు ముమ్మరమయ్యాయి. సాగర్ ఆయకట్టు కింద సాగుచేసిన వరిపొలాలు ఎండిపోగా బోర్లు, బావులు, చెరువులు కింద సాగుచేసిన పొలాలు ప్రస్తుతం కోతకు వచ్చాయి. సత్తుపల్లి నియోజకవర్గంలోని తల్లాడ, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి మండలాలతో పాటు వైరా మండలంలోని కొన్ని గ్రామాల్లో వరికోతలు జరుగుతున్నాయి. కొందరు రైతులు పంటకోసి రహదారులపైన, కల్లాల్లో ధాన్యాన్ని ఆరబెట్టగా, మరికొందరు పచ్చిధాన్యం(అప్పుడే కోసిన ధాన్యం)ను వ్యాపారులకు విక్రయిస్తున్నారు. తల్లాడ మండలంలోని మిట్టపల్లి, నూతనకల్, వెంగన్నపేట, లోకారం గ్రామాల్లో వరికోతలు ప్రారంభం అయ్యాయి. ఆకాశం దట్టంగా కమ్ముకొని రావడంతో రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టేందుకు భయపడుతున్నారు. వర్షం వస్తే ధాన్యం తడిసిపోతుందని భావించిన రైతులు యంత్రం (మిషన్)తో కోసిన ధాన్యాన్ని అప్పటికప్పుడే వ్యాపారులకు విక్రయిస్తున్నారు. వరి కోసేందుకు టైరు మిషన్‌కు గంటకు రూ.2వేలు, ట్రాకు(చైను) యంత్రానికి రూ.3వేలు చెల్లించి వరిని కోయిస్తున్నారు. రైతులు ప్రైవేట్ వ్యాపారులకు హెచ్ఎంటీ, సాంబ(బీపీటీ-5204) వంటి సన్నరకాలను విక్రయిస్తున్నారు. ధాన్యాన్ని ఆరబెట్టి నిల్వ ఉంచుకుందామన్నా వానల భయంతో పచ్చివడ్లనే అమ్ముకుంటున్నారు.పచ్చిధాన్యమే విక్రయిస్తున్నాం మండెపూడి సూరయ్య, రైతు, వెంగన్నపేటవెంగన్నపేట గ్రామంలో 15ఎకరాల్లో వరి సాగుచేశాను. ప్రస్తుతం పంట కోతకు వచ్చింది. మూడు రోజుల క్రితం వర్షం కురవడంతో టైర్ల వరికోత యంత్రం నడవడం లేదు. మళ్లీ వర్షం వస్తుందనే భయంతో చైన్ యంత్రంతో కోయిస్తున్నాం. ధాన్యం ఆరబోత, నిల్వ చేయడం కోసం పట్టాలు కొనుగోలు చేయాలి.

# సాగునీటి కోసం.. కోటి కష్టాలు

ఆదిలాబాద్ : కళ్ల ముందే పంట ఎండిపోతుండటంతో అన్నదాత దిగులు చెందుతున్నాడు. ఎలాగైనా పంటను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నాడు. జిల్లాలో సరైన వర్షాలు లేక పత్తి, కంది, మొక్కజొన్న పంటలు ఎండిపోతున్నాయి. సాగునీటి సదుపాయం లేని వారు దేవుడిపై భారం వేశారు. మరికొందరు కర్షకులు రూ.వేలల్లో ఖర్చు చేసి కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్న వైనంపై కథనం.పంటను కాపాడుకునేందుకు రైతులు ఆశతో నీటి వనరులను వెతుకుతున్నారు. ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు, వాగులు, చెక్‌డ్యాంల నుంచి నీటిని పొలాల్లోకి పారించుకునేందుకు ఎంత ఖర్చయినా సరే కిలో మీటర్ల కొద్ది పైపులేసి పత్తి, కంది ఇతర పంటలకు నీరందించే ప్రయత్నం చేస్తున్నారు. జిల్లాలో ప్రధానమైన మత్తడివాగు, సాత్నాల ప్రాజెక్టుల కాలువల నుంచి పత్తి, కంది పంటలకు నీరు పారించేందుకు తాంసి, భీంపూర్, ఆదిలాబాద్, జైనథ్, బేల మండలాల రైతులు కిలో మీటర్ల దూరమైనా పైపులు ఏర్పాట్లు చేస్తున్నారు. మధ్యలో రహదారి, గట్టు వంటివి వచ్చినా వాటిని తవ్వి అందులోంచి పైపులు వెళ్లేలా చేస్తున్నారు.



బోథ్, ఇచ్చోడ, తలమడుగు, నేరడిగొండ, ఉట్నూరు, గుడిహత్నూర్, బజార్‌హత్నూర్, సిరికొండ, ఇంద్రవెల్లి తదితర మండలాల రైతులు చెరువులు, కుంటల్లో నిలిచిన నీటిని పొలాల్లోకి తీసుకెళ్తున్నారు. బోరు బావులున్న రైతులు తమ పొలం తడవగానే పక్కన ఉన్న రైతులకు ఎకరానికి రూ.1000 నుంచి రూ.2 వేల వరకు తీసుకుంటూ నీరందిస్తున్నారు. పైపులు, ఆయిల్ ఇంజిన్, ఇతర అవసరాలకు ఎకరానికి వేలల్లో ఖర్చవుతోందని రైతులు చెబుతున్నారు. జిల్లాలో ఈ ఏడాది 5.40 లక్షల ఎకరాల్లో పంటలు వేయగా, అందులో 3.50 లక్షల ఎకరాల్లో పత్తి, మిగతాది కంది, సోయా, మొక్కజొన్న పంటలను వేశారు. వర్షాభావ పరిస్థితులతో దిగుబడులు సగానికి తగ్గిపోయి, పెట్టుబడులు సైతం రాని పరిస్థితి నెలకొంది. నీటి తడులు పెట్టిన రైతులకు మాత్రం ఎకరానికి 8 క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడి వస్తుందంటున్నారు.

ఆదిలాబాద్ మండలం రాంపూర్‌కు చెందిన రైతు యోగేష్ తనకున్న అయిదెకరాల్లో పత్తి పంట వేశారు. పంట పూత, కాత దశలో ఉండగా సరైన వర్షాలు లేక ఎండుముఖం పట్టింది. గత్యంతరం లేక పంటను రక్షించుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. సాగునీరు లేక దూరంగా ఉన్న మరో రైతు వ్యవసాయ బోరుబావి నుంచి 200 పైపులు వేసి నీటి తడులు పెడుతున్నారు. రాత్రి, పగలు చేనులో ఉంటూ నీరు పెడతున్నానని, ఎకరానికి 5 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

తాంసికి చెందిన రైతు కిషన్ మత్తడివాగు ప్రాజెక్టు పక్కన ఆయిల్ ఇంజిన్ ఏర్పాటు చేసి, పైపుల ద్వారా 4 ఎకరాల పత్తి పంటకు నీటి తడులు అందిస్తున్నారు. రోజుకు ఆయిల్ ఇంజిన్ అద్దెకు రూ.1000, 50 పైపులకు రూ.750, డీజిల్‌కు రూ.1,200 వరకు ఖర్చు చేస్తున్నారు. ఒక ఎకరం భూమి తడవడానికి రూ.4 నుంచి 5 వేల వరకు ఖర్చవుతోందని, పెట్టుబడులు సైతం వచ్చే పరిస్థితి కనిపించడం లేదని వాపోతున్నారు.

# సామాజిక మాధ్యమం.. అభ్యర్థికి ప్రచారం

సంగారెడ్డి : సామాజిక మాధ్యమం.. ఇప్పుడు అన్ని పార్టీల అభ్యర్థులకిది కీలకంగా మారింది. అభ్యర్థులు సోషల్ మీడియాలో చురుకుగా ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా యువతతో సైన్యాన్ని(బృందాలను) ఏర్పాటు చేసుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు సామాజిక మాధ్యమాలను అనుసరించడమే వీరి పని. దీంతో పాటు తమ అభ్యర్థికి అనుకూలంగా ఆకట్టుకునేలా పోస్టింగులను రూపొందిస్తూ ఓటర్లకు చేరవేస్తున్నారు. ఫేస్‌బుక్, వాట్సప్, ట్విటర్(ఎక్స్), ఇన్‌స్టా.. తదితరాల ద్వారా ప్రచారాలను ఇప్పటికే ప్రారంభించారు. వాట్సప్ గ్రూపులు ఎక్కువగా నిర్వహించే వారికి, ఎక్కువ మంది అనుచరులు కలిగిన వారికి ఇప్పుడు డిమాండ్ పెరిగింది. రాజకీయ పార్టీల ప్రతినిధులు వీరిని సంప్రదిస్తున్నారు. తమ అభ్యర్థులకు సంబంధించిన కరపత్రాలను, అనుకూల వీడియోలను వైరల్ చేసేలా ఎంతో కొంత మాట్లాడుకుని ఒప్పందాలు చేసుకుంటున్నారు.



పర్యవేక్షణకు ప్రత్యేక విభాగం

సామాజిక మాధ్యమాలపై పర్యవేక్షణకు ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా కలెక్టరేట్‌లో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. సోషల్ మీడియా మానిటరింగ్ విభాగం అధికారులు నిత్యం పోస్టింగులను పరిశీలిస్తున్నారు. ఎన్నికల సంఘం నియమావళికి విరుద్ధంగా ఉన్న పోస్టింగులను గుర్తిస్తున్నారు.

పరిధి దాటితే కటకటాలే

ఇది ఎన్నికల సమయం కావడంతో అందరూ అప్రమత్తంగా ఉండాల్సిందే. సంయమనం వీడితే కష్టాలు తప్పవని గుర్తించాలి. ప్రత్యర్థులు, వారి కుటుంబాలపై వ్యక్తిగతంగా కించపరిచే పోస్టులకు దూరంగా ఉండాలి. ఎదుటి పార్టీ నేతలపై దూషణలకు దిగడం చట్టరీత్యా నేరం. తన పరువుకు భంగం కల్గిందని అవతలి వ్యక్తి కోర్టుకు వెళ్లే అవకాశం ఉంది. నేరం రుజువైతే జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదు. ఒకే రకమైన పోస్టింగులు తరచూ చూడటం వల్ల మళ్లీ మళ్లీ అవే పోస్టులు మీ ఫోన్ స్క్రీన్‌పైకి వస్తుంటాయి. అలాంటి వాటికి దూరంగా ఉండటం వల్ల అనవసర పోస్టుల నుంచి తప్పించుకోవచ్చు. ఎన్నికలకు సంబంధించిన గ్రూపుల్లో పోస్టులు చేసే ముందు ఒకటికి పది సార్లు ఆలోచించాలని నిపుణులు సూచిస్తున్నారు.

## వానాకాలం సాగుకు ప్రణాళిక సిద్ధం

వరంగల్ :హనుమకొండ జిల్లాలో వ్యవసాయ అధికారులు వానాకాలం సాగుకు సన్నద్ధం అవుతున్నారు. సీజన్‌కు ముందే ప్రణాళిక సిద్ధం చేసుకొని రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపట్టారు. గతేడాది అనుభాలను దృష్టిలో ఉంచుకొని పలు పంటల సాగు సరళిలో మార్పులు తీసుక రావాలని భావిస్తున్నారు. దానికి అనుగుణంగా రైతులను చైతన్య పరిచేందుకు సదస్సులు నిర్వహించనున్నారు. రానున్న సీజన్‌లో వరిసాగు విస్తీర్ణం పెంచాలని, పత్తి సాగు తగ్గించాలని వ్యవసాయ శాఖ నిర్ణయించింది. నూనె గింజలు, పప్పుధాన్యాల పంటల సాగు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఎరువుల వినియోగం తగ్గించేలా అవగాహన కల్పించేందుకు క్లస్టర్ల వారీగా ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వ్యవసాయ విస్తరణాధికారులతో పాటు మండల, డివిజన్ అధికారులకు దీనిపై లక్ష్యాలు నిర్దేశించారు. నకిలీ విత్తనాలు అడ్డుకునేందుకు టాస్క్‌ఫోర్సు కమిటీలను సమాయత్తం చేస్తున్నారు.

పెరుగనున్న ప్రధాన పంటల సాగు....

జిల్లా సాధారణ సాగు విస్తీర్ణం 2.50 లక్షల ఎకరాలు కాగా.. వానాకాలం 2.42 లక్షల ఎకరాల్లో సాగయ్యే అవకాశముందని భావిస్తున్నారు. దీనిలో అత్యధికంగా 1.50 లక్షల ఎకరాల్లో వరి సాగయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. వరిలో కూడా 60 శాతం సన్నరకం వేసేలా రైతులను చైతన్యపరచాలని నిర్ణయించారు. మార్కెట్‌లో పత్తి, కంది, మొక్కజొన్నకు ధరలు బాగుండటంతో వీటి సాగు విస్తీర్ణం పెరగొచ్చని భావిస్తున్నారు. పత్తి గతేడాది 87,100 ఎకరాల్లో సాగు చేయగా దిగుబడి తగ్గడంతో.. ఈసారి 85 వేల ఎకరాల్లో సాగు కావచ్చని అంచనా వేస్తున్నారు. మొక్కజొన్న పంట సాగు పరిస్థితి అంతే. ప్రభుత్వం విత్తనాలపై రాయితీ రద్దు చేయడంతో వరి, పత్తి, కంది, మిరప వంటి వాటిని ప్రైవేటు కంపెనీల పైనే ఆధారపడాల్సి వస్తోంది. సాగు విస్తీర్ణం మేరకు కంపెనీలు ఏయే విత్తన రకాలు నిల్వ చేసుకున్నాయనే సమాచారం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. జిల్లాకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

## మార్కెట్ అడ్డాలు అమ్ముకున్నారు!

వరంగల్ : వరంగల్ ఎనుమాముల మార్కెట్ పరిధిలోని లక్ష్మీపురం నూతన కూరగాయల మార్కెట్‌ను రూ.6 కోట్లతో నిర్మించి గతేడాది మార్చిలో ప్రారంభించారు. ప్లాట్‌ఫాంలు, అడ్డాల కేటాయింపులో భారీగా అవకతవకలు జరిగాయి. ఒక్కొక్కరి నుంచి రూ.వేల నుంచి రూ.లక్షల్లో వసూళ్లకు పాల్పడినట్లు తెలుస్తోంది. స్థానిక నాయకులు, దళారులు సూచించిన వారికే అధికారులు అడ్డాలను కేటాయించడంతో అర్హులైన వారికి అవకాశం దక్కలేదు. అలాంటి చిరు వ్యాపారులు పాత మార్కెట్ ప్రాంతంలో రోడ్డుపైనే అడ్డాలు ఏర్పాటు చేసుకుని కూరగాయలు విక్రయిస్తున్నారు.

అసలు సూత్రధారులెవరు..?

పాత మార్కెట్ నుంచి కొత్త మార్కెట్‌కు దుకాణాలను తరలించే సమయంలో వ్యాపారులకు పారదర్శకంగా అడ్డాలను కేటాయించాలని టోకెన్ విధానం ప్రవేశపెట్టారు. గతంలో జారీచేసిన లైసెన్సుల ఆధారంగా కొందరికి టోకెన్లు ఇచ్చారు. ఇదే అదనుగా దళారులు డబ్బులు చెల్లించిన వారికే అడ్డాలు కేటాయిస్తామని ప్రచారం చేసి వారి నుంచి అందినకాడికి దండుకున్నారు. గుట్టుచప్పుడు కాకుండా అధికారులకు వాటా అందినట్లు తెలుస్తోంది. ఓ పొరుగుసేవల ఉద్యోగిని ముందుంచి మార్కెట్ అధికారి, కొంతమంది బడా నాయకులు, పాలకవర్గం సభ్యులు చక్రం తిప్పినట్లు వినికిడి. కొత్త మార్కెట్‌లో వ్యాపారమంటే తెలియని వారు అడ్డాలు, షాపులు పొంది నెలసరి అద్దెతో బినామీలకు కొందరు అప్పగించగా, మరికొందరు వ్యాపారం చేయకపోవడంతో కవర్‌షెడ్డులోని చాలా ప్లాట్‌ఫాంలు ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. మార్కెట్‌లోని 92 కమిషన్ దుకాణాల కేటాయింపుల్లోనూ రూ.లక్షల్లో చేతులు మారినట్లు తెలుస్తోంది. వాటిలో ఓ పార్టీకి చెందిన కార్పొరేటర్ ఒక్కరికే మూడు దుకాణాలు ఉన్నట్లు సమాచారం.

అనధికారికంగా అద్దె వసూళ్లు

ఏడాది కాలంగా మార్కెట్ కవర్‌షెడ్డులోని 158 ప్లాట్‌ఫాంలు, ఖాళీ ప్రదేశంలో కూరగాయలు విక్రయించే సుమారు 300 మంది వ్యాపారుల నుంచి అద్దెలు వసూలు చేయడంలో మార్కెట్ సిబ్బంది ఉదాసీనత చూపిస్తున్నారు. అద్దె ఖరారు చేసి ఏడాది గడుస్తున్నా.. వారి నుంచి వసూలు చేయడంలో వెనకడుగు వేస్తున్నారు. 158 ప్లాట్‌ఫాంలలో ఒక్కొక్క దానికి రూ.2,300 నిర్ధారించగా, ఏడాదికి రూ.43,60,800, ఖాళీ ప్రదేశంలో గీసిన డబ్బాల్లో కూర్చుని విక్రయించే సుమారు 300 మందికి ఒక్కొక్కరికి కేటాయించిన స్థలం (అడ్డా) విస్తీర్ణం ఆధారంగా నెలకు రూ.800, రూ.600, రూ.400 అద్దెను నిర్ణయించగా.. ఏడాదికి రూ.30లక్షల వరకు చిల్లర వర్తకులు చెల్లించాల్సి ఉంది. అందులో కొందరు మాత్రమే అరకొర అద్దెలు చెల్లిస్తున్నారు. 82 మంది కమిషన్ వ్యాపారుల నుంచి పూర్తిస్థాయిలో మార్కెట్ ఫీజు వసూలు చేసే విషయంలోనూ నిర్లక్ష్యం వహించడంతో ఇప్పటివరకు సుమారు రూ.20లక్షల మేర మార్కెట్ ఆదాయానికి గండిపడింది. అద్దెల విషయంలో మార్కెట్ ఉన్నతస్థాయి అధికారులు దృష్టి సారించకపోవడంతో కిందిస్థాయి సిబ్బంది వ్యాపారుల నుంచి ప్రతినెలా అనధికారికంగా వసూళ్లకు పాల్పడుతూ జేబులు నింపుకుంటున్నట్లు తెలుస్తోంది.

బాధితుల్లో కొందరు... ఖిలావరంగల్‌కు చెందిన బొల్లం రాధిక దివ్యాంగురాలు. 15 ఏళ్ల నుంచి మార్కెట్‌లో కొత్తిమీర, ఆకుకూరలను విక్రయిస్తున్నారు. లైసెన్సు ఉంది. నూతన మార్కెట్‌లో అడ్డా కేటాయిస్తామని ఓ వ్యక్తి రూ.20 వేలు వసూలు చేశాడు. ఇప్పటికీ అడ్డా చూపించలేదు. గేటు వద్ద వేరే వారిని బతిమిలాడి కొంత స్థలంలో ఆకుకూరలను విక్రయిస్తున్నారు. వరంగల్ శివనగర్‌కు చెందిన వన్నాల రమ గతంలో ఓ కమిషన్ వ్యాపారి దుకాణం ముందు కూరగాయలు విక్రయించేవారు. నూతన మార్కెట్‌లో ప్లాట్‌ఫాం కేటాయింపునకు పెండింగ్‌లో ఉన్న అద్దె చెల్లించాలని ఆదేశించడంతో రూ.60 వేలు చెల్లించారు. అందుకు సంబంధించిన రసీదు ఇప్పటికీ ఇవ్వలేదు. మార్కెట్ అధికారులతో సన్నిహితంగా ఉండే ఓ వ్యక్తి ఖిలా వరంగల్‌కు చెందిన కొప్పుల రాజు నుంచి మార్కెట్‌లో స్థలం కేటాయించేందుకు రూ.1.20 లక్షలు వసూలు చేశాడు. జాబితాలో పేరు లేకపోవడంతో డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరారు. ఆ వ్యక్తి జాప్యం చేస్తుండగా విషయాన్ని పోలీసులు, మీడియా దృష్టికి తీసుకెళ్తాననడంతో.. ఇటీవల తిరిగి చెల్లించాడు.అడ్డా చూపించేందుకు రూ.50 వేలు అడిగారు

–బండారి లావణ్య, ఖిలావరంగల్

14 ఏళ్ల నుంచి మార్కెట్‌లో కూరగాయలు విక్రయిస్తున్నాను. మార్కెట్ లైసెన్సు ఉంది. అద్దె, రెన్యువల్ ఫీజులు క్రమం తప్పకుండా చెల్లిస్తున్నా. కొత్త మార్కెట్‌లో అడ్డా కేటాయింపునకు మార్కెట్ సూపర్‌వైజర్ రూ.50 వేలు డిమాండ్ చేశారు. అంత స్తోమత తనకు లేదని బతిమిలాడినా కనికరించలేదు.నేరుగా ఫిర్యాదు చేయాలి–బి.వి.రాహుల్, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి కొత్త మార్కెట్‌లో వసూళ్లకు పాల్పడిన అంశం మా దృష్టికి రాలేదు. బాధితులు నేరుగా ఫిర్యాదు చేయాలి. ఖాళీ ప్లాట్‌ఫాంలకు సంబంధించి వ్యాపారులకు నోటీసులు జారీచేశాం. విక్రయాలు జరగని వాటిని గుర్తించి అర్హులకు కేటాయిస్తాం.

# పరిమితికి మించి గ్రానైట్ తరలింపు..!!



మహబూబాబాద్ : గ్రానైట్ రాయితో కనిపిస్తున్న ఈ లారీ ఇనుగుర్తి మండలంలోని క్వారీ నుంచి ఖమ్మంలోని పరిశ్రమకు తీసుకెళ్తున్నారు. నిబంధనల ప్రకారం 50 నుంచి 55 టన్నుల రాయిని తరలించాలి. అదనంగా 10 టన్నులు తరలిస్తున్నారు.. తీసుకెళ్లే రాళు నిర్దిష్టమైన ఆకారంలో లేవు. కింద పడకుండా ఎలాంటి తాళ్లు కట్టలేదు. ఇలా ప్రమాదకరంగా.. నిబంధనలకు వ్యతిరేకంగా రాళ్లను తీసుకెళ్తున్న ఐదు లారీలను జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు కురవిలోని 365వ జాతీయ రహదారిపై శనివారం పట్టుకున్నారు. వాటిలో మూడు లారీల్లోనే అధిక లోడ్‌తో గ్రానైట్‌ను తరలిస్తున్నట్లు గుర్తించి ఆ వాహనాలను కురవి ఠాణాకు తరలించి కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. అనంతరం వాటిపై చర్యలు తీసుకునేందుకు మైనింగ్, రవాణాశాఖ అధికారులకు అప్పగించామన్నారు. ప్రమాదకరంగా, అధిక లోడ్‌తో తరలిస్తున్న వాహనాలను పట్టుకుని చర్యలు తీసుకునే ప్రక్రియ కొనసాగుతుందని సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. మైనింగ్, రవాణా శాఖ అధికారులు నిర్ధారిస్తేనే గ్రానైట్ క్వారీల నిర్వాహకులు వ్యవహారం బయటపడనుంది.

గ్రానైట్ రాయి నిక్షేపాలకు పేరున్న జిల్లా నుంచి వివిధ ప్రాంతాలకు పరిమితికి మించి అధికలోడ్‌తో గ్రానైట్ రాయి తరలింపుపై గనులు, భూగర్భశాఖ, రవాణాశాఖ అదికారుల పట్టింపు కరవైంది. తనిఖీలు చేస్తూ చర్యలు తీసుకోవడం నామమాత్రంగా మారింది. ఈ రెండు శాఖల ఉదాసీన వైఖరిని ఆసరా చేసుకుంటున్న క్వారీల నిర్వాహకులు నిబంధనలు పట్టించుకోకుండా రవాణా కొనసాగిస్తున్నారు. ఫలితంగా అధిక లోడ్‌తో బండ రాళ్లను తరలిస్తున్న లారీలు పలుమార్లు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. 2022 డిసెంబరు 31 రోజున కేసముద్రంలోని ఓ క్వారీ నుంచి ఖమ్మంలోని గ్రానైట్ పరిశ్రమకు బండ రాళ్లను నిబంధనల కంటే 10 టన్నులు అధికంగా తీసుకెళ్తున్నారు. సాయంత్రం 7 గంటల సమయంలో కురవిలోని 365వ జాతీయ రహదారిపై ఎనిమిది మందితో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా..ఐదుగురు గాయపడ్డారు. రాళ్ల దాటికి రహదారి దెబ్బతింది. గత నెలలో తొర్రూరు మండలం నాంచారి మడూరు గ్రామ శివారులో గ్రానైట్ లారీ ఢీకొన్ని ఖమ్మం చెందిన ఇద్దరు వ్యక్తులు అక్కడిక్కడే మృతి చెందారు.

జిల్లాలో ఇలా

జిల్లాలో 167 బ్లాక్, కలర్ గ్రానైట్ క్వారీలున్నాయి. ఇందులో 53 క్వారీల్లో గ్రానైట్‌ను తీస్తున్నారు. కేసముద్రం, ఇనుగుర్తి, నెల్లికుదురు, తొర్రూరు, గూడూరు మండలాల్లో ఉన్నాయి. వీటి నుంచి అధికంగా ఖమ్మంలోని గ్రానైట్ పరిశ్రమలకు తరలిస్తున్నారు. ఆర్డర్ల ఆధారంగా ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. లారీ సామర్థ్యాన్ని బట్టి 45 నుంచి 55 టన్నులు, ట్రాక్టర్‌లో 5 టన్నుల రాయిని తరలించేందుకు గనులు, భూగర్భశాఖాధికారులు అనుమతి ఇస్తున్నారు.

ఇష్టారాజ్యంగా తరలింపు

అధిక లోడ్‌తోపాటు ఒక నిర్దిష్టమైన ఆకారంలో గ్రానైట్‌ను తరలించడం లేదు. క్వారీల నుంచి పరిశ్రమలకు తరలించే సమయంలో రాళ్ల ఎత్తుపల్లాలు సరిగా ఉండేలా కటింగ్ చేసి పంపించాలి. నిర్వాహకులు అలాంటి నిబంధనలేమి పాటించడం లేదు. ఎవరూ పట్టించుకోరని రాత్రి వేళల్లో రవాణా చేస్తున్నారు. సామర్థ్యాన్ని మించి రవాణా చేయడం వల్ల ప్రమాదాలకు దారి తీస్తున్నాయి. రహదారులు దెబ్బతింటున్నాయి. డోర్నకల్, మరిపెడ, నర్సింహులపేట తొర్రూరు, కేసముద్రం, నెల్లికుదురు, గూడూరు ప్రాంతల్లో ఇలాంటివి చోటుచేసుకుంటున్నాయి. రహదారులు దెబ్బతింటున్నాయని కొన్ని గ్రామాల ప్రజలు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన ఘటనలున్నా పరిస్థితిలో మార్పు రావడ లేదు.నిబంధనలు పాటించని వారిపై చర్యలు– రమేశ్‌రాథోడ్, ఎంవీఐ, మహబూబాబాద్‌క్వారీల నిర్వాహకులు రాయిని తరలింపులో నిబంధనలను పాటించాలి. కురవిలో పోలీసులు పట్టుకున్న లారీలను ఖమ్మంలోని వే బ్రిడ్జిపై తూకం వేయిస్తాం. అధిక లోడ్‌తో తరలిస్తున్న వాటిపై చర్యలు తీసుకుంటాం.

## పాలకా.. ప్రజా సేవకేది తీరిక!




భూపాలపల్లి : కార్పొరేటర్ అంటే డివిజన్ ప్రథమ పౌరుడు. ప్రజాప్రతినిధిగా ఎదిగేందుకు ఈ పదవి మొదటి మెట్టు లాంటింది. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ తదితర స్థానిక సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత వీరిదే. వీటన్నిం టినీ మరిచి వారు సొంత లాభం చూసుకుంటున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలు అమలు చేయకపోవడాన్ని ప్రజలు ప్రశ్నిస్తున్నారు గతంలో ఎన్నడూ లేని విధంగా ఇద్దరు భూకబ్జాల కేసులో జైలుకెళ్లి వచ్చిన ఘటనలను ఉదాహరిస్తున్నారు. అధికార, ప్రతిపక్ష కార్పొరేటర్లపై తీవ్రమైన ఆరోపణ లున్నాయి. మహా నగర పాలక సంస్థ పాలకవర్గం ప్రమాణ స్వీకా రం చేసి రెండేళ్లు పూర్తయిన నేపథ్యంలో వీరి పనితీరుపై పరిశీలన కథనం.

భర్తల పెత్తనం

గ్రేటర్‌లో 36 మంది మహిళా కార్పొరేటర్లు ఉన్నారు. రెండేళ్లవుతున్నా వీరిలో చాలా మంది ప్రజలతో మమేకం కాలేదు. షాడో కార్పొరేటర్లు పెత్తనం చెలాయిస్తున్నారు. కొందరు మహిళా కార్పొరేటర్ల భర్తల ఆగడాలు శృతి మించుతున్నాయని పౌరులు వాపోతున్నారు. 10–15 మంది కార్పొరేటర్లు సంతకాలకే పరిమితమయ్యారని విమర్శలు వస్తున్నాయి.

కబ్జాలపై ఫిర్యాదుల వెల్లువ

గతంలో ఎన్నడూ లేని విధంగా ఆయా డివిజన్లలో కబ్జాలు, ఆక్రమణల్లో కొందరు కార్పొరేటర్లు బహిరంగంగానే కనిపిస్తున్నారు. వివాదాస్ప దమైన స్థలాల్లో తలదూర్చి సొంతం చేసుకుంటున్నారని, ప్రజాప్రతిని ధుల అండతో ఐదారుగురు కార్పొరేటర్లు పెద్ద పెద్ద దందాలు చేస్తున్నారనే ఆరోపణలొచ్చాయి. ప్రభుత్వ స్థలాలు, లేఅవుటు ఖాళీ స్థలాలు, పార్కు స్థలాలు ఆక్రమణకు పాల్పడ్డారంటున్నారు. కాజీపేట, హనుమకొండ, వరంగల్ త్రినగరాలు, విలీన గ్రామాల్లో ప్రైవేటు పంచాయితీలు నిర్వహించి స్థలాలు సొంతం చేసుకోవడంపై వరంగల్ పోలీసు కమిషనర్ ఏవీ.రంగనాథ్‌కు వచ్చిన ఫిర్యాదుల్లో చాలా వరకు కార్పొరేటర్లు, మహిళా కార్పొరేటర్ల భర్తల పేర్లు ఉండటం గమనార్హం.

ఐదారుగురే అందుబాటులో..

నగరంలో 66 మంది కార్పొరేటర్లు ఉన్నారు. ప్రజలకు దగ్గరగా 10–12 మంది కార్పొరేటర్లు ఉంటున్నారు. 20–25 మంది సొంత వ్యాపారాలు, పైరవీలు, పలుకుడి కోసం పాకులాడుతున్నారు. 15– 20 మంది కార్పొరేటర్లు డివిజన్లలో ల్యాండ్ సెటిల్‌మెంట్లు, కబ్జాల్లో మునిగి తేలుతున్నారు. మరికొంత మంది మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చుట్టూ తిరుగుతున్నారు. ఐదారుగురు కార్పొరేటర్లే వీటికి దూరంగా ఉంటూ ప్రజలకు దగ్గరవుతున్నారు.

ఆదాయం కోసం తహతహ

కార్పొరేటర్‌గా గెలిచేందుకు రూ.కోట్లు ఖర్చు పెట్టామంటూ ఆదాయం కోసం తహతహలాడుతున్నారన్న విమర్శలున్నాయి. భవన నిర్మాణ అనుమతులు, అక్రమ నిర్మాణల్లో డబ్బులు వసూలు చేస్తున్నారని పౌరులు ఆరోపిస్తున్నారు. డబ్బులివ్వకపోతే పనులు ఆపిస్తున్నారని వాపోతున్నారు. డివిజన్లలో అభివృద్ధి పనులకు లెక్క గట్టి పర్సంటేజీలు వసూలు చేస్తున్నారు. కొందరు కార్పొరేటర్లు కొబ్బరి కాయ కొట్టగానే గుత్తేదార్లను పర్సంటేజీ అడుగుతున్నారని, దీంతో పలు డివిజన్లలో పనులు కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. కొందరు కార్పొరేటర్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్ల ద్వారా హోటళ్లు, అల్పాహార కేంద్రాలు, ఇతర వ్యాపార సంస్థల నుంచి డబ్బులు వసూలు చేయిస్తున్నారని తెలిసింది.

ఇవిగో ఉదాహరణలు హనుమకొండ నగరం నడిబొడ్డున ఇద్దరు కార్పొరేటర్ల కబ్జాల పర్వం ఎక్కువైంది. వారి డివిజన్లలోనే కాకుండా పక్క డివిజన్లలో వేలు పెడుతున్నారు. వీరికి తోడు మరో ఇద్దరు మాజీలు ఉన్నారు. కాలనీల్లో ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కన్నేస్తున్నారు. కాజీపేటకు చెందిన మరో కార్పొరేటర్ విలీన గ్రామాల్లో స్థలాల సెటిల్‌మెంట్లలో తలదూర్చుతున్నారని ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. రాజకీయ అండదండలతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. జాతీయ, రాష్ట్ర రహదారుల పరిధిలోని డివిజన్ల కార్పొరేటర్ల ఆక్రమణలు పెరిగాయి. చెరువు, కుంటలు, పాత పంచాయితీ స్థలాలు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు.

వరంగల్ ప్రాంతంలోని విలీన గ్రామాల మహిళా కార్పొరేటర్ భర్త ఇటీవల మూడు, నాలుగు ప్లాట్లు బినామీ పేరుతో రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. కేసులు నమోదైనా తీరు మారడం లేదు.

వరంగల్‌లోని ఇద్దరు, ముగ్గురు కార్పొరేటర్లు లేఅవుటు ఖాళీ స్థలాలు, ప్రభుత్వ స్థలాలపై కన్నేశారు. ఓ కార్పొరేటర్ మంచినీటి బావినే పూడ్చేశారు. వరంగల్‌లో కోట్లాది విలువైన పాత లేఅవుటు ఖాళీ స్థలం అక్రమ రిజిస్ట్రేషన్లకు కార్పొరేటర్ సహకారం అందించారు. ఓ కార్పొరేటర్ బిల్డర్ అవతారమెత్తారు. వివాదాస్పదమైన స్థలాలు సొంతం చేసుకొని భవన నిర్మాణాలు చేయిస్తున్నారు.

పాతబస్తీలో మహిళా కార్పొరేటర్ భర్తలు స్థలాల గొడవల్లో తలదూర్చారు. డివిజన్‌లో స్థలం కనిపిస్తే కొనేస్తున్నారు.

ఖమ్మం జాతీయ రహదారి పరిసరాల్లో అనధికార లేఅవుట్లకు ఓ కార్పొరేటర్ అండగా ఉంటున్నారు. లేఅవుట్ అనుమతులు వద్దని, ఫీజుల సొమ్ము నాకే ఇవ్వాలని స్థిరాస్తి వ్యాపారుల నుంచి రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారు.

## పైన రంగులు.. లోన అసంపూర్తి పనులు

వేములవాడ : మధ్యమానేరు జలాశయంలో గ్రామం ముంపునకు గురికావడంతో సర్వం కోల్పోయి నిర్వాసితులుగా మారిన కోతులకాలనీ నిర్వాసితులకు ఇంకా రెండు పడక గదుల ఇళ్లు దరి చేరలేదు. వారికి ప్రభుత్వం పునరావాసం కింద ఇళ్లు మంజూరు చేసినప్పటికీ అవి అసంపూర్తిగా ఉండటంతో గుడారాల్లోనే బిక్కుబిక్కుమంటూ ఉంటున్నారు. ఎండ, వాన, చలిని భరిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ తలుపులు, కిటికీలు, ఫ్లోరింగ్ వంటి పనులు పూర్తి చేయకుండా వదిలేశారు. బయట మాత్రం రంగులు వేసి ఇళ్లు పూర్తి చేసినట్లు చెబుతుండటం గమనార్హం.

వేములవాడ మండలంలోని రుద్రవరం గ్రామ కోతులకాలనీలో దాదాపు 75 కుటుంబాలుండగా ఇందులో 40 కుటుంబాలకు చింతల్‌ఠాణా ఆర్‌అండ్‌ఆర్ కాలనీ శివారులో ప్రభుత్వం ఇళ్ల ప్లాట్లు కేటాయించింది. అయిదేళ్ల క్రితం రూ. 2.20 కోట్లతో రెండు పడక గదుల నిర్మాణ పనులు చేపట్టినప్పటికీ అవి నేటికీ అసంపూర్తిగానే ఉండటంతో నిర్వాసితులు ఆందోళన చెందుతున్నారు. బయటకు చూడటానికి రంగులు వేసి కనిపిస్తున్నప్పటికీ చాలా ఇళ్లకు మాత్రం తలుపులు, కిటికీలు అమర్చలేదు. కొందరు సొంత డబ్బులు పెట్టుకొని అమర్చుకోగా మరికొందరు కిటికీలకు అట్టలు, చీరలు అడ్డంగా పెట్టుకుని కాలం వెళ్లదీస్తున్నారు. చాలా ఇళ్లలో తలుపులు, కిటికీలు, బాత్‌రూంల డోర్లు, ఫ్లోరింగ్ వంటి పనులు చేయాల్సి ఉంది. అసంపూర్తి పనులను పూర్తి చేయాలని నిర్వాసితులు పదేపదే అధికారులు, గుత్తేదారుకు మొర పెట్టుకున్నప్పటికీ ఫలితం లేదు. దీంతో నిర్వాసితులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. వాటిని పూర్తి చేస్తే ఇళ్లలో నివాసం ఉండేందుకు అవకాశం ఉన్నప్పటికీ ఆ దిశగా అధికారులు, గుత్తేదారు చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.నీటి ట్యాంకు లేక కష్టాలుకోతులకాలనీలో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్ల కాలనీలో నీటి వసతికి ట్యాంకు లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుత్తేదారు నిర్లక్ష్యం వారికి శాపంగా మారింది. ఇళ్లు అసంపూర్తిగా ఉండటంతో వాటి ముందే గుడారాలు వేసుకొని నిర్వాసిత కుటుంబాలు అసౌకర్యాల మధ్య కాలం వెల్లదీస్తున్నాయి. నీటి ట్యాంకు లేక బోర్ల పైపులతో డ్రమ్ములు, డబ్బాల్లో నీళ్లు పట్టుకొని వినియోగించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. విద్యుత్తు సరఫరాకు అంతరాయం వస్తే నీటికి నానా అవస్థలు పడుతున్నారు. నీరు సరిపోక బోరు నడిచినంత సేపు డ్రమ్ముల్లో నింపుకోవడానికి అందరు తిప్పలు పడుతున్నారు.

## నీరివ్వని భగీరథ

మేడిపల్లి : మండల కేంద్రాల్లో జరుగుతున్న సర్వసభ్య సమావేశాల్లో మిషన్ భగీరథ అంశంపైనే ఎక్కువ చర్చ జరుగుతోంది. ప్రతి సమావేశంలోనూ చర్చ జరుగుతుండటం అధికారులకు, ప్రజాప్రతినిధులకు వాగ్వాదం జరగడం సాధారణంగా మారింది. మేడిపల్లి మండలంలో రెండు సంవత్సరాలుగా మిషన్ భగీరథ అంశంపై చర్చ జరుగుతుండగా ఇటీవల వాగ్వాదం తారస్థాయికి చేరుకుంది. ఒక దశలో రాజీనామా చేస్తామని ప్రజాప్రతినిధులు ప్రకటించే పరిస్థితి వచ్చింది. కొడిమ్యాల, మల్యాల, కథలాపూర్, కోరుట్ల, సారంగాపూర్, ఇబ్రహీంపట్నం తదితర మండలాల సమావేశాల్లోనూ తమ గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు రావడం లేదని, పైపులైన్లు పగిలి పోయాయని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. పురపాలక సమావేశాల్లోనూ ఇదే అంశంపై చర్చ జరిగింది. జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశంలోనూ పలువురు శాసనసభ్యులు మిషన్ భగీరథ నీటి సరఫరాపై ఆగ్రహం వ్యక్తం చేసిన సందర్భాలున్నాయి.

లీకేజీలే ప్రధాన సమస్య

జిల్లాలోని సగం గ్రామాల్లో పైపులైన్ల నుంచి నీరు లీకేజీ కావడంతో సమస్యలు వస్తున్నాయి. ఇంట్రా పైపులైన్ వేసే గుత్తేదార్లు ఇప్పటికే పలుసార్లు మారడంతో సమన్వయ లోపం ఏర్పడింది. అధికారులు కూడా గుత్తేదార్లపై ఆగ్రహం వ్యక్తం చేసినా చాలా గ్రామాల్లో ఫలితం లేకుండా పోయింది. కాగితాలపై పూర్తి స్థాయిలో పైపులైన్ వేసినట్లు లెక్కలున్నా కొన్ని గ్రామాల్లో 50 శాతం పైపులైన్ కూడా వేయలేదని బీమారం మండలం వెంకట్రావుపేట సర్పంచి కాటిపల్లి జగన్ రెడ్డి పేర్కొన్నారు. మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో గతంలోని బోర్‌వెల్స్ నుంచి నీటిని వినియోగిస్తే విద్యుత్తు బిల్లులు ప్రజలే చెల్లించాల్సిన దుస్థితి నెలకొందని గోవిందారం సర్పంచి కరండ్ల మధుకర్ ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామంలో నీటి సరఫరాలో ఇబ్బందులున్నా వీధి దీపాలు, మిషన్ భగీరథ కోసం నెలకు రూ.65,000 నుంచి రూ.1.20 లక్షల మేర బిల్లులు చెల్లించాల్సి వస్తోందని మల్యాల మండలం రామన్నపేట సర్పంచి గడ్డం జలజ తెలిపారు. తమ గ్రామంలో 1,300 గృహాలు ఉంటే సుమారు 450 ఇళ్లకు మాత్రమే నల్లా కనెక్షన్లు ఇచ్చారని, అలాంటప్పుడు నూరు శాతం నల్లా కనెక్షన్లు ఇచ్చినట్లు ఎలా అవుతుందని మల్యాల మండలం ముత్యంపేట సర్పంచి బద్దం తిరుపతి రెడ్డి ప్రశ్నించారు. రెండు మూడు రోజులకు ఒకసారి నీళ్లు వస్తున్నాయని, అడిగితే మోటార్లు కాలిపోయాయని అధికారులు చెబుతున్నారని పలువురు సర్పంచులు పేర్కొంటున్నారు. భగీరథ పుణ్యమాని పట్టణాలు, పల్లెల్లో అంతర్గత రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద నల్లాలు ఏర్పాటు చేసినా 90 శాతం నల్లాలు పని చేయవు.

పుణ్యక్షేత్రంలోనూ తిప్పలే!

రాష్ట్రంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు అంజన్న సన్నిధిలోనూ నీటి కష్టాలు తప్పడం లేదు. మిషన్ భగీరథ కింద కొండగట్టులో 5 లక్షల లీటర్ల సామర్థ్యం చొప్పున 2 ట్యాంకులు నిర్మించారు. 2 ట్యాంకులు కలిపి 10 లక్షల లీటర్ల సామర్థ్యమున్నా భక్తులకు సరిపడా నీరు అందడం లేదు. నిర్వహణలోనూ అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. మిషన్ భగీరథ నీటిని వాడుకున్నందుకు ఆలయానికి నెలకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు బిల్లులు చెల్లించాల్సి వస్తోంది.

పథకం స్వరూపమిదీ..! మిషన్ భగీరథ పథకం కింద జగిత్యాల జిల్లాకు రెండు గ్రిడ్ల ద్వారా తాగునీరు సరఫరా అవుతోంది. రాజన్న సిరిసిల్ల జిల్లా అగ్రహారం నుంచి జిల్లాలోని మేడిపల్లి, కథలాపూర్, మల్యాల, కొడిమ్యాల మండలాలకు మిగిలిన మండలాలకు ఇబ్రహీంపట్నం మండలం డబ్బా నుంచి నీరు వస్తోంది. డబ్బా నుంచి ప్రతిరోజూ 145 మిలియన్ లీటర్లు, అగ్రహారం నుంచి 120 మిలియన్ లీటర్లు నీటిని సరఫరా చేస్తున్నారు. భగీరథ కోసం జిల్లాలో 1,200 కిలోమీటర్ల మేర పైపులైన్ నిర్మాణం పూర్తి చేశారు. 2,400 కిలోమీటర్ల మేర ఇంట్రా(అంతర్గత) పైపులైన్ల నిర్మాణం పూర్తయింది. భగీరథ కింద కొత్తగా 380 ట్యాంకులు నిర్మించగా 520 పాత ట్యాంకులు కలిపి మొత్తం 900 ట్యాంకుల ద్వారా తాగునీరు సరఫరా అవుతోంది. జిల్లాలో మిషన్ భగీరథ కింద 2,25,000 నల్లాలు బిగించారు.

సిబ్బంది కొరతతో..: శేఖర్ రెడ్డి, ఈఈ, మిషన్ భగీరథ

మిషన్ భగీరథ కింద ట్యాంకులకు నీరు సరఫరా చేయడం వరకే మా బాధ్యత. గ్రామాల్లో ఇంటింటికీ నీరు సరఫరా చేయడం స్థానిక ప్రజాప్రతినిధులే చూసుకోవాలి. చాలా గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది లేకపోవడంతో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతోంది. కొన్ని గ్రామాల్లో కనీసం వాల్వ్‌లు తెరిచే సిబ్బంది కూడా లేరు. మెట్‌పల్లి ప్రాంతంలో నాలుగైదు గ్రామాల్లో సమస్యలుంటే వాటిని కూడా పరిష్కరించాం. ప్రస్తుతానికి జిల్లాలో సమస్యలు తక్కువే ఉన్నాయి.

## పొదుపుగా తాగునీరు

కరీంనగర్ : కరీంనగర్ నగరవాసులకు ప్రతి రోజు తాగునీరు సరఫరా చేస్తుండగా.. ఈ నిర్ణయాన్ని అమలు చేసేందుకు కుస్తీ పడాల్సి వస్తోంది.. వేసవి కావడంతో అవసరాలు పెరిగిపోగా ఆ మేరకు శుద్ధి నీటిని పంపిణీ చేసేందుకు కావాల్సిన రావాటర్ అందకపోవడంతో ఆలస్యమవుతోంది.. రెండు నెలలుగా డ్యాంలో నిల్వలు తగ్గడంతో ఇబ్బందులు మొదలయ్యాయి. కొన్ని ప్రాంతాలకు ప్రెషర్‌తో సరఫరా అవుతుండగా, మరికొన్ని ప్రాంతాలకు సన్నగా వస్తుందని ఫిర్యాదులున్నాయి.


దిగువకు నీటి మట్టం

దిగువ మానేరు జలాశయమే ప్రధాన తాగునీటి వనరు. ఇందుల్లోంచి దిగువకు కాకతీయ కాల్వ ద్వారా వదులుతున్నారు. పది రోజులుగా 500–600 క్యూసెక్కులు కిందకు వదులుతున్నారు. వ్యవసాయ అవసరాలతోపాటు వరంగల్, ఖమ్మం ప్రాంతాలకూ ఇక్కడి నుంచే నీరు వెళ్తోంది. మిషన్ భగీరథతోపాటు పాత ఫిల్టర్‌బెడ్‌కు నేరుగా పైపులైను ద్వారా రావాల్సిన నీరు అందడం లేదు. పైపుల గుండా రాకపోవడంతో బూస్టర్ పంపుల ద్వారా పంపింగ్ చేసుకుంటున్నారు. రోజురోజుకు లెవల్స్ పడిపోవడంతో శుద్ధి జలం సరిపోవడం లేదు.

ఆటంకాలు లేకుండా పంపులు నడవాలంటే..

నగరానికి కావాల్సిన తాగునీటిని మానేరు డ్యాం నుంచి తీసుకుంటున్నారు. ప్రస్తుతం 8.218 టీఎంసీలే నిల్వ ఉండడంతో బూస్టర్ పంపులకు ఆశించిన స్థాయిలో చేరడం లేదు. ఆటంకాలు లేకుండా పంపులు నడవాలంటే 903 అడుగుల నీరు ఉండాలి. అంటే 11 టీఎంసీలు అవసరం. ఫిబ్రవరిలో 906.70 అడుగుల నీరుండగా 14 టీఎంసీలతో ఎలాంటి సమస్యలు రాలేదు. దిగువకు వదలడంతో నిల్వలు తగ్గాయి. కనీసం ఒక టీఎంసీ నిల్వ ఉంటే బూస్టర్లకు సక్రమంగా నీరందుతుంది. అప్పుడు శుద్ధి చేసుకోవడానికి అంతరాయం ఉండదు. మోటార్ల నిలిపివేత..శుద్ధి కేంద్రానికి రావాటర్ అందకపోవడంతో శుద్ధి చేసే నీరు సంపుల్లోకి రావడం లేదు. మిషన్ భగీరథ ఫిల్టర్‌బెడ్‌లో ఒక మోటారును తరచూ నిలిపి వేస్తున్నారు. ఇక్కడ 370 హెచ్‌పీ మోటార్లు రెండు నడుస్తుండగా, మూడో 370 హెచ్‌పీ మోటారు ఉదయం 5 గంటలు కచ్చితంగా నడవాలి. గత కొన్ని రోజులుగా రెండు గంటలు మాత్రమే నడుస్తోంది. లోలెవల్ కోసం ఉన్న పాత ఫిల్టర్‌బెడ్ మాత్రం పూర్తి స్థాయిలో వినియోగిస్తున్నారు. ఇక్కడి నుంచి శుద్ధి నీరు మిషన్ భగీరథకు కూడా పంపిస్తున్నారు.

వృథా తగ్గించి.. పొదుపు పాటించాలినగర పాలక సంస్థ ప్రతి రోజు 60 డివిజన్ల పరిధిలో తాగునీరు సరఫరా చేసేందుకు వెనుకడుగు వేయడం లేదు. ఆశించిన స్థాయిలో అందక పోవడంతో ఆలస్యంగా సరఫరా చేస్తున్నారు. అవసరమున్నంత మేరకు నీటిని నింపుకొని బిరడాల ద్వారా నిలిపి వేయాలి. మురుగునీటి కాల్వల్లో, బోరు, బావుల్లో వదలకూడదు. ట్యాంకులలో నిల్వ ఉంటే ఇతర ప్రాంతాలకు సరఫరా చేసేందుకు అవకాశం ఉంటుంది.




# బెయిల్ మూల సిద్ధాంతాల్ని కోర్టులు మరిచిపోతున్నాయి

## దర్యాప్తు సంస్థల దుర్బుద్ధిని గుర్తించడం లేదు

### పీటీఐ ఇంటర్వ్యూలో సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ మదన్ బి లోకుర్ వ్యాఖ్యలు

దిల్లీ: బెయిల్ మంజూరు, లేదా తిరస్కరణపై మూల సిద్ధాంతాలను న్యాయస్థానాలు మరిచిపోతున్నట్లున్నాయని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ మదన్ బి లోకుర్ అభిప్రాయపడ్డారు. నిందితులను కారాగారంలో ఉంచాలనే ఉద్దేశంతో దర్యాప్తు సంస్థలు చేసే ప్రయత్నాలను గుర్తించేందుకు న్యాయవ్యవస్థ సుముఖంగా లేకపోవడం 'అత్యంత దురదృష్టకరం' అని అన్నారు. పీటీఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఈ-మెయిల్ ఇంటర్వ్యూలో ఆయన పలు వ్యాఖ్యలు చేశారు. దిల్లీలో ఆప్ నేత మనీశ్ సిసోదియాకు న్యాయస్థానం బెయిల్ నిరాకరించడంపై ఆయన ఈ మేరకు స్పందించారు. ప్రస్తుత రోజుల్లో ఒక వ్యక్తి అరెస్టయితే కనీసం కొన్ని నెలలపాటు జైల్లో ఉండాల్సి రావడం ఖాయమని అన్నారు. 'పోలీసులు మొదట ఒక వ్యక్తిని అరెస్టు చేస్తారు. ఆ తర్వాత సీరియస్‌గా దర్యాప్తు మొదలుపెడతారు. దర్యాప్తు సంస్థలు అరకొర వివరాలతో ఛార్జిషీటు వేసి, తర్వాత అనుబంధ ఛార్జిషీటు దాఖలు చేస్తాయి.

ఈ కోణాన్ని కొన్ని కోర్టులు చూడడం లేదు. న్యాయశాస్త్ర పుస్తకాలు ఇలాంటి మొత్తం కథను చెప్పవు. ఈ సత్యాలను న్యాయవ్యవస్థ గుర్తెరగాలి' అని జస్టిస్ లోకుర్ చెప్పారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు తమ దర్యాప్తు సంస్థల్ని దుర్వినియోగం చేస్తున్నట్లు విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఎలాంటి వైఖరి అనుసరించాలనే ప్రశ్నకు సమాధానంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బెయిల్ విషయాల్లో విచక్షణాధికారాలను ఎలా వినియోగించుకోవాలనే ప్రాథమిక సూత్రాలను నిర్దేశిస్తూ సుప్రీంకోర్టు గతంలో పలు తీర్పులు వెలువరించిందని గుర్తుచేశారు. ఈ విషయం తెలిసినా కొన్ని కోర్టులు వాటిని పాటించడం లేదని, అది ఎందుకనేదే ప్రశ్న అని అన్నారు.




దిల్లీ: వెలుగుల పండగ దీపావళి సమీపిస్తున్న వేళ.. భారత్ కు ఇజ్రాయెల్ ఓ విన్నపం చేసింది. హమాస్ చెరలో బందీలుగా ఉన్న తమ పౌరుల విడుదల కోసం భారతీయులంతా దీపాలు వెలిగించాలని అభ్యర్థించింది. ఈ మేరకు భారత్‌కు ఇజ్రాయెల్ రాయబారి నవోర్ గిలాన్ ఎక్స్ వేదికగా ఓ వీడియో పోస్ట్ చేశారు. అందులో హమాస్‌తో తమ దేశం చేస్తున్న పోరును.. చెడుపై శ్రీరాముడు చేసిన యుద్ధంతో పోల్చారు. "గాజాలోని హమాస్ ఉగ్రవాదుల వద్ద 240 మంది ఇజ్రాయెల్, ఇతర దేశాల పౌరులు బందీలుగా ఉన్నారు. వీరిలో హోలోకాస్ట్ నుంచి బయటపడిన వారు.. చిన్న చిన్న పిల్లలు కూడా ఉన్నారు. వారి విడుదల కోసం ఇజ్రాయెల్ అన్ని ప్రయత్నాలు చేస్తోంది. త్వరలో దీపావళి పండగ రానుంది. చెడును గెలిచి అయోధ్యకు తిరిగొచ్చిన ఆ శ్రీరాముడి విజయానికి గుర్తుగా దీపావళి పండగ చేసుకుంటున్నాం. ఎలాగైతే శ్రీరాముడి రాకను దీపాలు వెలిగించి వేడుక చేసుకుంటున్నామో.. అలాగే బందీలుగా ఉన్న మా ప్రియమైన వాళ్ల క్షేమంగా తిరిగి ఇళ్లకు చేరుకుంటారనే ఆశతో మనం దీపాలు వెలిగిద్దాం. వారంతా క్షేమంగా తిరిగి రావాలని ప్రార్థిద్దాం" అని గిలాన్ భారతీయులను అభ్యర్థించారు. ఈ విశ్వాసమనే దీపాన్ని ప్రతి ఒక్కరూ వెలిగించి.. ఆ ఫొటోలు షేర్ చేయాలని గిలాన్ కోరారు. ఈ సందర్భంగా ఆయన కూడా దీపాలు వెలిగిస్తున్న ఫొటోను ఎక్స్‌లో షేర్ చేశారు. దీనికి చ%ణఅఋశీటనశీజూవ% అనే హ్యాష్‌ట్యాగ్‌ను జత చేశారు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై దాడి చేసిన తర్వాత హమాస్ అక్కడి నుంచి కొంతమందిని కిడ్నాప్ చేసి గాజాలో బంధించిన విషయం తెలిసిందే. గత నెల రోజులుగా వారు హమాస్ చెరలోనే ఉన్నారు. దీంతో బందీల విడుదల కోసం హమాస్‌పై ఇజ్రాయెల్ భీకర పోరు సాగిస్తోంది. బందీలను విడిచిపెడితేనే కాల్పుల విరమణ చేపడుతామని ఇజ్రాయెల్ ఇప్పటికే స్పష్టం చేసింది.




దేశ రాజధాని దిల్లీలో వాయు నాణ్యత దారుణంగా క్షీణిస్తోంది. దీంతో దిల్లీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంట వ్యర్థాలను తగులబెట్టడమే వాయు కాలుష్యానికి ముఖ్య కారణం. దిల్లీ పరిస్థితిపై ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్రా స్పందించారు. సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటూ.. తన ఆలోచనలు, అభిప్రాయాలను పంచుకునే ఆనంద్ మహీంద్రా వాయు కాలుష్య నివారణకు చక్కటి సలహా ఇచ్చారు. "పునరుత్పత్తి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా దిల్లీలో కాలుష్యం తగ్గే అవకాశం ఉంటుంది. ఇది కాలుష్యాన్ని తగ్గించడమే కాక నేల ఉత్పాదకతను కూడా పెంచుతుంది. పంట వ్యర్థాలను కాల్చడానికి బదులుగా ఈ ప్రత్యామ్నాయాన్ని పాటించడం లాభదాయకం" అంటూ.. అందుకు సంబంధించిన వీడియోను ఎక్స్ (ట్విటర్) వేదికగా షేర్ చేశారు. ఇదిలా ఉండగా.. రాజధాని నగరంలో వాయు నాణ్యత పడిపోతుండటంతో కాలుష్య నియంత్రణకు దిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దీపావళి మరుసటి రోజు నుంచి 'సరి- బేసి' విధానాన్ని అమల్లోకి తీసుకురానుంది. అంతేకాకుండా, పాఠశాలలకు నవంబరు 10వ తేదీ వరకు సెలవులను ప్రకటించింది.

# స్టీల్ ప్లాంట్‌పై వైసీపీ ఎంపీలవి సన్నాయి నొక్కులు

విశాఖపట్నం: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు చేపట్టిన ఉద్యమం వెయ్యి రోజులకు చేరుకుంది. ఈ ఉద్యమానికి మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, బండారు, మాజీ ఎమ్మెల్యే పళ్ళ. ఎమ్మెల్సీలు, ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్, కాంగ్రెస్, జనసేన పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పోరాటాలు ద్వారా సాధించుకున్న పరిశ్రమ విశాఖ స్టీల్ ఫ్లాంట్ అని.. 32 మంది ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. విశాఖ స్టీల్ ఫ్లాంట్ కోసం ఎన్నికలు పక్కన పెట్టి పోరాడాలన్నారు. విశాఖ స్టీల్ ఫ్లాంట్ కోసం తాను రాజీనామా చేశానని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి స్టీల్ ఫ్లాంట్ విషయంలో విఫలం అయ్యారని విమర్శించారు. వైసీపీ ఎంపీలు స్టీల్ ఫ్లాంట్ కోసం ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. వైసీపీ ఎంపీలు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలకు ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదన్నారు. ముఖ్యమంత్రి ఒకసారి కూడా ఉక్కు కార్మికుల దీక్షా శిబిరానికి వచ్చి సంఘీభావం తెలియజేయలేదని గంటా శ్రీనివాసరావు విమర్శలు గుప్పించారు.



**పార్లమెంటులో ఓ ఊపు... ఊపుతా: కేఏ పాల్** – విశాఖ స్టీల్ ఫ్లాంట్ కోసం ఎందరో పోరాటం చేశారన్నారు. తాను స్టీల్ ఫ్లాంట్ పరిరక్షణ కోసం న్యాయం పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. స్టీల్ ఫ్లాంట్ భూములు రియల్ ఎస్టేట్ కోసం అమ్ముకుంటున్నారన్నారు. "నా మీద కేసు పెట్టే దమ్ము ఉందా. విశాఖ ఎంపీగా నన్ను గెలిపించండి. నాకు జేడీ లక్ష్మీనారాయణ పూర్తి మద్దతు ఇవ్వనున్నారు. పార్లమెంటులో ఒక ఊపు, ఊపుతాను" అంటూ కేఏపాల్ పేర్కొన్నారు.




# జనాభా నియంత్రణ వ్యాఖ్యలపై దుమారం.. క్షమాపణలు చెప్పిన నీతీశ్ కుమార్

పట్నా: జనాభా నియంత్రణ విషయంలో మహిళల విద్యకున్న ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ బిహార్ సీఎం నీతీశ్‌కుమార్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. భాజపా నేతలతో సహా పలువురు నేతలు ఈ వ్యాఖ్యలను ఖండిస్తున్నారు. ఈ వ్యవహారంపై జాతీయ మహిళా కమిషన్ ఛైర్మన్ రేఖా శర్మ స్పందిస్తూ.. నీతీశ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి స్పందించారు. 'నా వ్యాఖ్యలకు క్షమాపణ చెప్తున్నాను. నా మాటలతో తప్పుడు సందేశం వెళ్లి ఉంటే వాటిని వెనక్కి తీసుకుంటా' అని అన్నారు. ఇటీవల బిహార్‌లో నిర్వహించిన కులగణనకు సంబంధించిన నివేదికను మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సందర్భంగా నీతీశ్ మాట్లాడుతూ.. చదువుకున్న మహిళలు శృంగారంలో తమ భర్తలను నియంత్రించగలరని వ్యాఖ్యానించారు."భర్తల చర్యల వల్ల జననాలు పెరిగాయి. అయితే చదువుకున్న మహిళకు భర్తను ఎలా నియంత్రించాలో తెలుసు. అందుకే ఇప్పుడు జననాల రేటు తగ్గుతూ వస్తోంది" అని మాట్లాడారు. దీనిపై భాజపా తీవ్రంగా స్పందించింది. నీతీశ్ తన వ్యాఖ్యలతో ప్రజాస్వామ్య హుందాతనాన్ని దెబ్బతీశారని విమర్శించింది. 'అసెంబ్లీలో అలాంటి వ్యాఖ్యలు సిగ్గుచేటు. ఆయన మానసిక రుగ్మతతో బాధపడుతున్నట్లు కనపడుతోంది. ఆయన తక్షణమే తన పదవికి రాజీనామా చేసి, వైద్యుడిని సంప్రదించాలి' అని పేర్కొంది. నీతీశ్ వ్యాఖ్యలను రేఖా శర్మ తీవ్రంగా ఖండించారు. 'మహిళల హక్కులు, ఎంపికల విషయంలో ఆయన వ్యాఖ్యలు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలి' అని డిమాండ్ చేశారు. అలాగే బిహార్ అసెంబ్లీలోనూ నిరసన వ్యక్తమైంది. 'నా మాటలు వెనక్కి తీసుకుంటున్నా. నేను మీడియా ముందు ఇచ్చిన వివరణను అందరూ చూశారు. ఇంకెందుకు అసెంబ్లీలో ఈ అరుపులు' అని నీతీశ్ విపక్షాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే.. ఈ వివాదంపై జేడీయూ మిత్రపక్షమైన ఆర్జేడీ నుంచి మద్దతు రావడం గమనార్హం. ఆయన మాటలను వక్రీకరించకూడదని ఆర్జేడీ నేత, ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ కోరారు.




దిల్లీ: జనాభా నియంత్రణ విషయంలో మహిళల విద్యకున్న ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ బిహార్ సీఎం నీతీశ్‌కుమార్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి. వీటిని ఉద్దేశిస్తూ..ప్రధాని మోదీ తీవ్రంగా స్పందించారు. ఇంకా ఎంతగా దిగజారిపోతారంటూ నీతీశ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మధ్యప్రదేశ్‌లోని గుణలో ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న సందర్భంగా మోదీ ఈ విధంగా మాట్లాడారు. 'ప్రతిపక్షాల అహంకార కూటమిలో పెద్దనేత అయిన ఆయన.. నిన్న అసెంబ్లీలో మహిళలను ఉద్దేశించి అసభ్య పదజాలం ఉపయోగించారు. ఇలాంటి మాటలు వాడటం పట్ల వారికి సిగ్గుగా అనిపించడం లేదా..? ఆ కూటమిలోని ఏ ఒక్కనేత కూడా నీతీశ్ మాటలను ఖండించలేదు. మహిళల గురించి ఈ రకమైన ఆలోచన ఉన్నవారు మీకు ఏదైనా మంచి చేయగలరా..? మన తల్లులు, సోదరీమణుల పట్ల ఇలాంటి దురుద్దేశంతో దేశాన్ని అవమానిస్తున్నారు. మీరు ఇంకా ఎంతగా దిగజారిపోతారు..?' అంటూ నీతీశ్ వ్యాఖ్యలను ఆక్షేపించారు. ఇటీవల బిహార్‌లో నిర్వహించిన కులగణనకు సంబంధించిన నివేదికను మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సందర్భంగా నీతీశ్ మాట్లాడుతూ.. చదువుకున్న మహిళలు తమ భర్తలను నియంత్రించగలరని వ్యాఖ్యానించారు.

"భర్తల చర్యల వల్ల జననాలు పెరిగాయి. అయితే చదువుకున్న మహిళకు భర్తను ఎలా నియంత్రించాలో తెలుసు. అందుకే ఇప్పుడు జననాల రేటు తగ్గుతూ వస్తోంది" అని మాట్లాడారు. ఈ మాటలపై దుమారం రేగడంతో నీతీశ్ క్షమాపణలు చెప్పాల్సి వచ్చింది. 'నా మాటలు మిమ్మల్ని ఇబ్బందికి గురిచేస్తే.. వాటిని ఉపసంహరించుకుంటా' అని పేర్కొన్నారు.

# చెట్టు ఫొటో పెట్టి ఓటు.. ఏపీలో ఎన్నికల ప్రక్రియ అపహాస్యం: తెదేపా

అమరావతి: రాష్ట్రంలో ఓట్ల అవకతవకలపై తెదేపా నేతలు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనాను సచివాలయలంలో కలిసి ఫిర్యాదు చేశారు. నియోజకవర్గాల వారీగా తొలగించిన ఓట్ల వివరాలను అందజేశారు. ఫామ్-7 దుర్వినియోగం చేస్తున్నారని ఎన్నికల ప్రధానాధికారికి వివరించారు. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, బొండా ఉమా, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తదితరులు ఎన్నికల ప్రధాన అధికారిని కలిసిన వారిలో ఉన్నారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. "వైకాపాకు చివరి ఘడియలు వచ్చాయి. వాలంటీర్ల ద్వారా ఓట్లు తొలగించి గెలవాలని చూస్తున్నారు. ఫామ్-6, ఫామ్-7కు సంబంధించి 11 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఓటు ఉందా లేదా అని రోజూ ప్రతి ఒక్కరూ చూసుకోవాల్సి వస్తోంది. ఒకే ఇంట్లో 4 ఓట్లు ఉంటే నాలుగు బూత్‌లలో వారికి ఓట్లు ఉన్నాయి. పేరుకే కేసులు పెడుతున్నా ఎవరిపై చర్యలు తీసుకోవట్లేదు. ఇప్పటికి ఎన్నికల సంఘానికి 13 లేఖలు ఇచ్చాం. ఆధారాలతో సహా ఎన్నికల సంఘాన్ని కలిశాం. త్వరలో కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలుస్తాం" అని అచ్చెన్న తెలిపారు. "ఎలాంటి విచారణ లేకుండానే తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుల ఓట్లు తొలగిస్తున్నారు. విజయవాడలో వైకాపా నాయకుడి తల్లి పేరుతో ఒకే పోలింగ్ స్టేషన్‌లో 3 ఓట్లు ఉన్నాయని చెబితే.. ప్రొసీజర్ ప్రకారం తొలగిస్తామని చెబుతున్నారు. సెంట్రల్ నియోజకవర్గం పరిధిలోని పోలింగ్ స్టేషన్ 44లో ఒక చెట్టు ఫొటో పెట్టి ఓటు ఇచ్చారు. ఏపీలో ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేస్తున్నారు. ఒకే వ్యక్తి పేరుతో రెండు.. మూడు ఓట్లు పక్కపక్కనే ఉన్నాయని చెప్పినా పట్టించుకోకుండా ప్రొసీజర్ పేరుతో జాప్యం చేస్తున్నారు. చనిపోయిన వారి ఓట్లు కూడా ఓటర్ల జాబితాలో ఉన్నాయి. విజయవాడ సెంట్రల్‌లో 12వేల ఓట్లు తారుమారయ్యాయి" అని బొండా ఉమా అని ఆవేదన వ్యక్తంచేశారు.



# 'నాట్ బిఫోర్ మీ'.. రఘురామ పిల్‌పై విచారణ నుంచి తప్పుకొన్న న్యాయమూర్తి

అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై వైకాపా ఎంపీ రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన పిల్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. సీఎం జగన్, ఆయన బంధుగణం, వివిధ కంపెనీలకు రూ.కోట్లలో అనుచిత లబ్ధి చేకూరేలా వైకాపా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, రూపొందించిన పాలసీలపై సీబీఐ దర్యాప్తు కోరుతూ రఘురామ పిల్ వేశారు. దీనిపై 'నాట్ బిఫోర్ మీ' అంటూ విచారణ నుంచి జస్టిస్ రఘునందనరావు తప్పుకొన్నారు.

ఈ నేపథ్యంలో వేరే బెంచ్ వద్ద పిల్ విచారణకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రీని సీజే బెంచ్ ఆదేశించింది.



# రోజా ఏ విధంగా అవినీతికి పాల్పడిందో డేటా మొత్తం బీజేపీ దగ్గరుంది



చిత్తూరు : ఏపీ సీఎం జగన్ కళ్ళల్లో ఆనందం చూసేందుకు ప్రతిపక్ష నాయకులను వ్యక్తిగతంగా విమర్శలకు టార్గెట్ చేస్తున్నారని ఏపీ బీజేపీ అధికార ప్రతినిధి భాను ప్రకాష్ రెడ్డి తెలిపారు. విజయ్ సాయి రెడ్డి, రోజా పురందేశ్వరి పై చేసిన వ్యక్తిగత విమర్శలకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. పురందేశ్వరి సంధిస్తున్న ప్రశ్నలకు జగన్‌కు, ఆ పార్టీ నేతలకు వెన్నులో వణుకు పుడుతోందన్నారు. భయంతో బ్యాలెన్స్ తప్పి నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని భానుప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. ఈ నాలుగేళ్ల కాలంలో మంత్రి రోజా ఏవిధంగా అవినీతికి పాల్పడింది?.. ఎన్ని కోట్లు సంపాదించి ఎక్కడెక్కడ దాచుకున్నారనే డేటా మొత్తం సీఎం జగన్మోహన్ రెడ్డి వద్ద, బీజేపీ వద్ద ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆమెకు టికెట్ వచ్చే ప్రసక్తే లేదని భానుప్రకాష్ రెడ్డి తెలిపారు. వచ్చినా గెలిచే పరిస్థితి లేదన్నారు. కచ్చితంగా ప్రభుత్వం మారబోతోందన్నారు. వైసీపీ అవినీతి అంతా కక్కి కక్కించడం ఖాయమన్నారు. దొంగ ఓట్లు కరెన్సీ నోట్లతో గెలవాలని వైసీపీ ప్రభుత్వం యోచిస్తోందన్నారు. ఓటుకు లక్ష రూపాయలు ఇచ్చిన వైసీపీ ప్రభుత్వం వచ్చే అవకాశమే లేదన్నారు. నగిరిలో రోజా చేసిన అభివృద్ధిని ప్రశ్నించడానికి రేపు నగరికి బీజేపీ వెళుతోందన్నారు. దమ్ము ధైర్యం ఉంటే అక్కడ అభివృద్ధిపై తేల్చుకుందాం అంటూ రోజాకు భాను ప్రకాష్ రెడ్డి సవాల్ విసిరారు.

# బ్లాక్ ఔట్ ఫిట్ లో నిధి దుమారం

అందానికి అందం.. వేడెక్కించే హొయలు నిధి అగర్వాల్ సొంతం. ఆరంభంలో మడికట్టినా! అటుపై అమ్మడిలో చాలా రకాల మార్పులొచ్చాయి. గ్లామర్ వరల్డ్ లో ఎలా ఫోకస్ అవ్వాలో! టెక్నిక్ పట్టుకుని ముందుకెళ్తుంది. చిట్టిపొట్టి దుస్తుల్లో...బికినీ అందాల్లో..స్కిన్ షోతో యువతని ఎలా ఆకర్షించాలో! పనిగట్టుకుని షో చేస్తుంది. తాజాగా బ్యూటీ మరో హాట్ పిక్ తో అంతర్జాలంలోకి ఎక్కేసింది. ఇదిగో ఇక్కడిలా డిజైనర్ బ్లాక్ కలర్ ఔట్ ఫిట్ లో తళుకులీనింది. టాప్ టూ బాటమ్ అమ్మడు సింగిల్ పిట్ లో కనిపిస్తుంది. మోచేతుల నుంచి చేతి వేళ్లవరకూ అదే రంగు సాక్సులు ధరించింది. అలాగే మోకాలి వరకూ బ్లాక్ కలర్ మ్యాచింగ్ షూస్ నే ఎంపిక చేసుకుంది. మొత్తంగా సొగసరి ముస్తాబైన విధానం చూపరులను ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. ఇక నిధి అభిమానుల



కామెంట్లకు హద్దు లేదు. లుక్స్ గార్జియ స్..బ్యూటిఫుల్..మైండ్ బ్లోవింగ్ అంటూ కామెంట్లు గుప్పిస్తున్నారు.

నిధి అగర్వాల్ కెరీర్ సంగతి చూస్తే హరి హర వీరమల్లు లాంటి క్రేజీ పాన్ ఇండియా చిత్రంలో నటిస్తోన్న సంగతి తెలిసిందే. అమ్మడి టాలీవుడ్ ఆశలన్నీ ఈ సినిమాపైనే పెట్టుకుంది. సక్సస్ తో పాన్ ఇండియాలో ఐడెంటిటీ దక్కుతుందని ఆశపడుతుంది. ఒకే ఒక్క బ్లాక్ బస్టర్ అందుకుని సిసలైన లీగ్ లో అడుగు పెట్టాలని చూస్తోంది. కానీ తానెంత తొందరపడుతున్నా ఆ ప్రాజెక్ట్ అంతకంతకు ఆలస్యమవుతుంది. తాను ఒకటి తలిస్తే దైవం మరొకటి తలిచింది అన్నచందంగా కనిపిస్తుంది. పవన్ కళ్యాణ్ సవ్యంగా డేట్లు కేటాయించకపోవడంతో ఆ సినిమా షూటింగ్ నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ఇటీవలే కొన్ని రకాల పూజలు సైతం చేసింది. మరి ఆ పూజల ఫలితం ఏదైనా దక్కుతుందా? అన్నది చూడాలి.

# మత్తు కళ్లతో రింగ్‌లోకి లాగుతున్న శర్మా గాళ్


ఫిట్‌నెస్ లేదా ఫ్యాషన్ పరంగా శర్మా సిస్టర్స్ జోష్ గురించి తెలిసిందే. షైనింగ్ విత్ శర్మా సిస్టర్స్ షోతోను శర్మా సిస్టర్స్ పాపులరయ్యారు. ఇక నేహాశర్మతో పోటీపడుతూ తన సోదరి ఐషా శర్మ నిరంతరం ఫ్యాషన్ గోల్స్ పరంగా స్ఫూర్తిని నింపుతోంది. తాజాగా ఐషా షేర్ చేసిన మరో హాట్ సెల్ఫీ అంతర్జాలంలో వైరల్ గా మారింది. బ్రౌన్ ఫ్రాకులో మత్తు కళ్లతో ఐషా టూ హాట్ గా కనిపిస్తోంది. ఐషా అందం హాట్ నెస్ నిరంతరం యువతరంలో హాట్ టాపిక్. ఈ భామ చిరునవ్వు ఎంతో ఆకర్షణ. ఐషా శర్మ ఆరోగ్యకరమైన జీవనశైలి నేటియూత్ కి స్ఫూర్తి. ఫిట్‌నెస్, స్కిన్‌కేర్ విషయంలో నేహా ఎల్లపుడూ ఎంతో శ్రద్ధతో ఆకట్టుకుంటుంది. అభిమానులు ఆమె లుక్స్‌పై స్మోకింగ్



హాట్ అంటూ కామెంట్లు చేయడం చాలా సాధారణం. సోషల్ మీడియాల్లో ఐషా శర్మ నిరంతరం తన అనుచరులకు స్ఫూర్తి నింపే వెల్‌నెస్ చిట్కాలను వివరిస్తుంది. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. 2018లో 'సత్యమేవ జయతే' చిత్రంలో జాన్ అబ్రహం, మనోజ్ బాజ్‌పేయ్‌లతో కలిసి ఐషా శర్మ తన నటనా కెరీర్ ని ప్రారంభించింది. ఆ తర్వాత చాలా మ్యూజిక్ వీడియోలలో కూడా నటించింది. వీటికి అద్భుతమైన ప్రజాదరణ దక్కింది. ఐషా సోదరి క్రూక్, తుమ్ బిన్, యమ్లా పగ్లా దీవానా 2, యంగిస్తాన్, క్యా సూపర్ కూల్ హై హమ్ మరియు తానాజీ వంటి చిత్రాలలో నేహా కనిపించింది. ఆమె చివరిగా జోగిర సారా రా చిత్రంలో నవాజుద్దీన్ సిద్ధిఖీ, సంజయ్ మిశ్రా మరియు మహాఅక్షయ్ చక్రవర్తితో కలిసి కనిపించింది.





# గుంటూరు కారం దమ్ మసాలా బిర్యానీ అదిరింది




సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందుతున్న గుంటూరు కారం సినిమా ను సంక్రాంతి కానుకగా వచ్చే ఏడాది జనవరి 12 న ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్న విషయం తెల్సిందే. ఈ సినిమా ఫస్ట్ సింగిల్ కోసం ఫ్యాన్స్ తో పాటు సినీ ప్రముఖులు మరియు మీడియా వర్గాల వారు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు గుంటూరు కారం ఫస్ట్ సింగిల్ వచ్చేసింది. దర్శకుడు త్రివిక్రమ్ బర్త్ డే సందర్భంగా విడుదల అయిన దమ్ మసాలా బిర్యానీ సాంగ్ కి మంచి రెస్పాన్స్ వస్తోంది. ఈ పాటకు థమన్ సంగీతాన్ని అందించగా సరస్వతి పుత్ర రామజోగయ్య శాస్త్రి సాహిత్యం ను అందించారు. వీరిద్దరి కాంబోలో ఈ మధ్య కాలంలో వచ్చిన పలు పాటలు మంచి విజయాన్ని సొంతం చేసుకున్నాయి. మహేష్ బాబు పాత్రను కాస్త రివీల్ చేయడంతో పాటు, విజువల్స్ ను కూడా ఈ లిరికల్ వీడియోలో రివీల్ చేయడంతో ఫ్యాన్స్ కి కన్నుల పండుగ అన్నట్లుగా ఉంది. ఈ పాటను సంజిత్ హెగ్డే మరియు థమన్ లు కలిసి ఆలపించారు. ఇద్దరూ కూడా పోటీ పడి పాడినట్లు ఉంది. మహేష్ ఇమేజ్ కి తగ్గట్లుగా మ్యూజిక్ ఉందని, అలాగే లిరిక్స్ కూడా చాలా పవర్ ఫుల్ గా ఉన్నాయంటూ కామెంట్స్ వస్తున్నాయి. మహేష్ బాబు అభిమానులు ఎప్పుడెప్పుడా అంటూ ఎదురు చూస్తున్న ఈ సినిమాలో హీరోయిన్ గా శ్రీ లీల నటిస్తోంది. మరో ముఖ్య పాత్రలో మీనాక్షి చౌదరి నటిస్తున్న విషయం తెల్సిందే. త్రివిక్రమ్ మరియు మహేష్ బాబు కాంబోలో గతంలో వచ్చిన అతడు మరియు ఖలేజా కమర్షియల్ గా నిరాశ పరిచాయి. కానీ ఈ సినిమా కచ్చితంగా ఇండస్ట్రీ హిట్ గా నిలుస్తుందనే నమ్మకం వ్యక్తం అవుతోంది. పుష్కర కాలంగా ఎదురు చూస్తున్న వీరి కాంబో మూవీ వస్తున్న నేపథ్యంలో అభిమానులు సంక్రాంతికి డబుల్ ధమాకా ఖాయం అన్నట్టుగా చాలా ధీమాతో ఉన్నారు.

# మౌనం వీడిన సలార్ టీమ్.. ఇదిగో బ్యాడ్ న్యూస్!




ఫ్యాన్ ఇండియా స్టార్ ప్రభాస్ బ్యాడ్ లక్ ఏమిటో గాని మొదట్లో పాజిటివ్ అంచనాలు పెంచుకుంటున్న ప్రతి సినిమా కూడా చివరికి వచ్చేసరికి ఏదో ఒక కారణం చేత మళ్లీ నెగటివ్ వైబ్రేషన్స్ ను క్రియేట్ చేసుకుంటుంది. మొదటినుంచి కూడా సలార్ సినిమాపై మాస్ ఫ్యాన్స్ లో అయితే మామూలు అంచనాలు లేవు. కేజీఎఫ్ దర్శకుడు ప్రశాంత్ నీల్ ఈ సినిమాను అంచనాలకు మించి తెరపైకి తీసుకువస్తాడు అని తప్పకుండా అతను బాహుబలి స్థాయిలో ప్రభాస్ కు హిట్ అయితే ఇస్తాడు అని రెబల్ స్టార్ ఫ్యాన్స్ ఎంతో నమ్మకం పెట్టుకున్నారు. అయితే ఈ సినిమా విడుదల విషయంలోనే ఇంకా సస్పెన్స్ క్రియేట్ చేస్తోంది. సినిమాను సెప్టెంబర్ 28వ తేదీన గ్రాండ్ గా విడుదల చేస్తామని గత ఏడాది నుంచి చెప్పుకుంటూ వస్తున్న చిత్ర యూనిట్ సభ్యులు మొత్తానికి సినిమాను అయితే వాయిదా వేసేశారు. ఈపాటికి సినిమా ప్రమోషన్స్ తో హడావిడి చేస్తారు అనుకుంటే ఊహించని విధంగా ట్విస్ట్ అయితే ఇచ్చారు. గత వారం రోజులుగా ఈ సినిమా వాయిదా పడుతుంది అని సిజి వర్క్ ఆలస్యం అవుతుంది అని అలాగే ఓటీటీ బిజినెస్ డీల్ క్లోజ్ కాలేదు అని ఇలా చాలా రకాల కారణాలు వైరల్ అయ్యాయి. అయితే వార్తలు ఎన్ని వస్తున్నా కూడా నిన్నటి వరకు మౌనంగానే ఉన్న నిర్మాణ సంస్థ హొంబెల్ ప్రొడక్షన్స్ మొత్తానికి మౌనం వీడింది. ఈ విధంగా అయితే వివరణ ఇచ్చారు. 'సలార్ కోసం మీ అచంచలమైన మద్దతును మేము అభినందిస్తున్నాము. అయితే ఊహించలేని పరిస్థితుల కారణంగా సెప్టెంబర్ 28 విడుదల చేయాలనుకున్న సలార్ ని వాయిదా వేయాల్సి వస్తోంది. మంచి సినిమా అనుభవాన్ని అందించడానికి మేము కట్టుబడి ఉన్నాము. కాబట్టి, ఈ నిర్ణయం జాగ్రత్తగా తీసుకోబడిందని దయచేసి అర్థం చేసుకోండి. మా టీమ్ అత్యున్నత ప్రమాణాలను అందుకోవడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తోంది. కొత్త విడుదల తేదీ నిర్ణీత సమయంలో వెల్లడి చేయబడుతుంది. సలార్ తుది మెరుగులు దిద్దుతున్నప్పుడు మీ సపోర్ట్ అవసరం. ఈ అద్భుతమైన ప్రయాణంలో భాగమైనందుకు ధన్యవాదాలు.. అంటూ నిర్మాణ సంస్థ వివరణ ఇచ్చింది. అయితే మళ్లీ ఎప్పుడు ఈ సినిమా ఉంటుంది అనే విషయంలో మాత్రం సరైన క్లారిటీ ఇవ్వలేదు. ఇండస్ట్రీలో వినిపిస్తున్న టాక్ ప్రకారం అయితే సినిమా ఈ ఏడాది నవంబర్ లేదా డిసెంబర్లో రావచ్చు అని తెలుస్తోంది.

# అమ్మ పేరుతో హంసానందిని కేన్సర్ పౌండేషన్!

క్యాన్సర్ మహమ్మారిని జయించిన నటీమణుల్లో నటి హంసా నందిని ఒకరు. రొమ్ము క్యాన్సర్‌తో ఆమె పెద్ద యుద్ధమే చేసి జయించారు. ఇది సాధరణంగా వచ్చిన క్యాన్సర్ కాదు. తన తల్లి నుంచి జన్యుపరంగా క్యాన్సర్ బారిన పడాల్సి వచ్చింది. ఈ క్రమంలో ఎంతో మానసిక క్షోభకి గురయ్యారు. అయినా మహమ్మారిని జయించి ఎంతో మందిలో స్పూర్తి నింపారు. అప్పటి నుంచి హంసానందిని క్యాన్సర్ బాధితల పట్ల ఏదో వీడియో రూపంలో నెటి జనుల ముందుకొస్తున్నారు. తన బాధ్యతగా అవేర్ నేస్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పుకొస్తున్నారు. తాజాగా నేడు నేషనల్ క్యాన్సర్ డే సందర్భంగా హంసానందిని మరో వీడియోని ఇన్ స్టాలో పోస్ట్ చేసారు. అందులో క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమానికి సంబంధించి తమ యామినీ పౌండేషన్ ద్వారా సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఎవరికి



ఎలాంటి సహాయం కావాలన్నా యామినీ పౌండేషన్ ద్వారా అన్ని రకాల సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. పౌండేషన్ కి సంబంధించిన మెయిల్ ద్వారా కూడా తమ సమస్యని వివరించవచ్చు అని పేర్కొన్నారు. రెగ్యులర్ సెల్ఫ్ చెకప్స్.. మామోగ్రఫీ.. జెనెటిక్ పరీక్షలు చేయించుకొంటే క్యాన్సర్ బారిన పడకుండా ఉంటే రక్షించుకోవచ్చని చెబుతున్నారు. బ్రెస్ట్ కేన్సర్, దానికి సంబంధించిన చికిత్సల గురించిన సమాచారం దేశంలోని ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా చూడాలన్నది తన లక్ష్యమని హంసానందిని చెబుతున్నారు. జీవితంలో ప్రతి క్షణాన్ని ఆఖరి క్షణంలా జీవించాలని క్యాన్సర్‌పై విస్తృత అవగాహన కల్పించి, సాధ్యమైనంతమంది ప్రాణాలు కాపా డాలని. దాని కోసమే మా అమ్మ పేరు మీద 'యామిని కేన్సర్ ఫౌండేషన్' నెలకొల్పనున్నట్లు చెప్పొకొచ్చారు. –కష్టాలతో కూడిన ప్రయాణం అం దమైన గమ్యానికి మార్గం. ఎప్పుడూ బతుకు మీద ఆశ వదులుకోవద్దు. కేన్సర్ నుంచి బయటపడడం ఒక్కటే కాదు.. మళ్లీ ఆరోగ్యకరమైన అద్భుతమైన జీవితం కూడా సాధ్యమే అని గతంలో ఓ వీడియో చేసారు.

# నయన్ ఇటు మాత్రం రావట్లే..

సౌత్ ఇండియాలో స్టార్ హీరోయిన్ గా తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ సొంతం చేసుకున్న అందాల భామ నయనతార. ఈ అమ్మడు ప్రస్తుతం కోలీవుడ్ లో లేడీ సూపర్ స్టార్ బ్రాండ్ తో దూసుకుపోతోంది. అత్యధిక రెమ్యునరేషన్ తీసుకుంటున్న సౌత్ హీరోయిన్ గా కూడా నయనతార ఉంది. ఆమెకి ఇంత స్టార్ ఇమేజ్ రావడానికి కారణం తెలుగు సినిమా అని చెప్పాలి. టాలీవుడ్ లో స్టార్ హీరోలందరితో నయనతార ఆడిపాడింది. అవి సక్సెస్ కావడంతో నయనతార కూడా నెంబర్ వన్ హీరోయిన్ గా మారింది. తరువాత కోలీవుడ్ లోకి అడుగుపెట్టి అక్కడ కూడా వరుస విజయాలు అందుకుంది. సోలోగా లేడీ ఒరియాంటెడ్ కథలతో సక్సెస్ లు అందుకుంది. అయితే కోలీవుడ్ లో ఆమెని ఫ్యాన్స్ చాలా ప్రత్యేకంగా చూస్తారు. రీసెంట్ గా జవాన్ మూవీ బ్లాక్ బస్టర్ కావడంతో నయనతార ఇమేజ్ కూడా అమాంతం పెరిగిపోయింది. ప్రస్తుతం జయం రవితో చేసిన ఇరైవన్ మూవీ రిలీజ్ కి రెడీగా ఉంది. అయితే



నయనతారని టాలీవుడ్ లో ఒక సినిమా కోసం బడా నిర్మాత సంప్రదించారంట. రెమ్యునరేషన్ కూడా గట్టిగానే ఆఫర్ చేసారంట. కానీ ఆమె మాత్రం చేయడానికి ఆసక్తి చూపించలేదనే టాక్ వినిపిస్తోంది. కనీసం కథ కూడా వినడానికి మొగ్గు చూపించలేదంట. ప్రస్తుతం ఇదే న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఎందుకనో తెలుగు సినిమాలు చూడటానికి నయనతారకి ఎలాంటి ఆసక్తి లేదనే ప్రచారం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తెలుగు చిత్రాల ద్వారానే స్టార్ హీరోయిన్ గా ఎదిగి ఇప్పుడు టాలీవుడ్ ని చిన్న చూపు చూస్తోందని కొంత మంది నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఆమె చివరిగా తెలుగులో సైరా నరసింహారెడ్డి చిత్రంలో కనిపించారు. ఆ మూవీలో మంచి ప్రాధాన్యత ఉన్న పాత్రనే చేసింది. అయితే వరుస కమిట్మెంట్ లు ఉండటంతోనే ఆమె ప్రాజెక్ట్ చేయడం లేదనే మరో టాక్ కూడా వినిపిస్తోంది. కేవలం డేట్స్ అడ్జస్ట్ చేయలేకపోవడం వలన రెమ్యునరేషన్ ఎక్కువగా ఇచ్చిన కూడా ఆసక్తి చూపించలేదని కోలీవుడ్ సర్కిల్ లో వినిపిస్తోన్న మాట. ప్రస్తుతం నయనతార ఓ వైపు తల్లిగా ఇద్దరు పిల్లల బాధ్యత చూసుకుంటూ మరో వైపు సినిమాలు చేస్తూ ఉండాలి. ఇది కొద్దిగా కష్టంగా కూడుకున్నది. అందుకే ఎక్కువ సినిమాలు చేయడం లేదని టాక్.



# ధరణి తీసేస్తే మళ్లీ దళారుల వ్యవస్థ

సిర్పూర్ కాగజ్‌నగర్: త్వరలో జరగనున్న ఎన్నికల్లో ప్రజలు విచక్షణతో ఓటు వేయాలని భారాస అధినేత, సీఎం కేసీఆర్ అన్నారు. ఓటుకు చాలా విలువ ఉంటుందని.. ఆషామాషీగా వేయొద్దని సూచించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సిర్పూర్ కాగజ్‌నగర్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ మాట్లాడారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో పరిణతి రావాలని.. సేవ చేసే వ్యక్తులకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. మంచి చేసే పార్టీ ఏది? ఏ ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమాలను చేపట్టింది? అనే అంశాలపై ఆలోచించి ఓటు వేయాలని కేసీఆర్ సూచించారు. "2004 ఎన్నికలకు ముందు తెలంగాణ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఎన్నికలు అవగానే ఇచ్చిన హామీని ఆ పార్టీ విస్మరించింది. తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో అన్నట్లు నేను పోరాడాను. భారాస పోరాటానికి భయపడి కాంగ్రెస్ ప్రత్యేక తెలంగాణ ఇచ్చింది. ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడిన తర్వాత భూముల ధరలు పెరిగాయి. రాష్ట్రంలో తండాలకు సైతం శుద్ధమైన నీరు వస్తోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో 24 గంటల కరెంటు ఇస్తున్నాం. రాష్ట్రంలో ఒక్కో విద్యార్థిపై రూ. 1.25లక్షలు ఖర్చు పెడుతున్నాం. రైతులకు ఇబ్బంది ఉ ండకూడదనే ఉద్దేశంతో రైతుబంధు ఇస్తున్నాం. పోడుభూముల పట్టాల పంపిణీకి కేంద్రం అడ్డంకిగా మారింది. రైతుబంధు దుబారా అని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. 24 గంటల కరెంట్ ఇవ్వడం వృథా అని రేవంత్‌రెడ్డి అంటున్నారు. భూ వివాదాలు ఉండకూడదనే ధరణి పోర్టల్ తీసుకొచ్చాం. కాంగ్రెస్ హయాంలో లంచం ఇస్తేనే రిజిస్ట్రేషన్లు జరిగేవి. ప్రస్తుతం ఎలాంటి లంచాలు ఇవ్వకుండానే అర్ధగంటలో అవుతున్నాయి. రైతులకు ఇబ్బంది ఉండకూడదనే ఉద్దేశంతోనే రైతుబంధు ఇస్తున్నాం. ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. ధరణి తీసేస్తే రైతుబంధు, రైతుబీమా, ధాన్యం కొనుగోళ్ల డబ్బులు ఎలా వస్తాయి?ధరణి తీసేస్తే రైతులకు భూములపై ఉన్న హక్కులు పోతాయి. మళ్లీ దళారుల వ్యవస్థ వస్తుంది" అని కేసీఆర్ అన్నారు.

**మొరాయించిన హెలికాప్టర్ :** కాగజ్‌నగర్‌లో సీఎం కేసీఆర్ హెలికాప్టర్ మొరాయించింది. కాగజ్‌నగర్ సభ అనంతరం హెలికాప్టర్‌లో సీఎం ఆసిఫాబాద్‌కు వెళ్లాల్సి ఉండగా, టేకాఫ్ కాలేదు. దీంతో రోడ్డు మార్గంలో ఆయన ఆసిఫాబాద్ ప్రజా ఆశీర్వాద సభకు బయలుదేరి వెళ్లారు.


**గిరిజనేతరులకూ త్వరలో పోడు పట్టాలు :** భారాస పుట్టిందే తెలంగాణ ప్రజల కోసమని సీఎం కేసీఆర్ అన్నారు. బుధవారం ఆసిఫాబాద్‌లో నిర్వహించిన భారాస ప్రజా ఆశీర్వాద సభలో సీఎం పాల్గొని మాట్లాడారు. తెలంగాణ తెచ్చుకోబట్టే ఆసిఫాబాద్ జిల్లా అయ్యిందన్నారు. "గతంలో వానాకాలం వచ్చిందంటే మంచం పట్టిన మన్యం అని పత్రికల్లో వచ్చేది. ఇప్పుడు ఆసిఫాబాద్‌లో మెడికల్ కాలేజీ, వంద పడకలతో ఆసుపత్రి వచ్చాయి. జల్, జంగల్, జమీన్ నినాదంతో పోరాడిన కుమురం భీం పేరు జిల్లాకు పెట్టుకున్నాం. గిరిజనులకు పోడు పట్టాలు ఇచ్చాం. గిరిజనేతరులకూ త్వరలో పట్టాలు ఇస్తాం" అని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు.



# కిషన్‌రెడ్డి ప్రకటనపై సీబీఐ మాజీ డైరెక్టర్ కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: ముఖ్యమంత్రి కేసీఆర్ అంగీకరిస్తే రెండు గంటల్లోనే కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరుపుతుందంటూ తెలంగాణ బీజేపీ అధ్యక్షులు కిషన్‌రెడ్డి చేసిన ప్రకటనపై సీబీఐ మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు స్పందించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ జరపొచ్చని.. సీబీఐ విచారణకు తెలంగాణ ప్రభుత్వ అనుమతి అవసరం లేదని కిషన్‌రెడ్డికి సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణకు ఎవరి అనుమతి అవసరం లేదన్నారు. కేంద్ర జలశక్తి శాఖే సీబీఐ విచారణకు ఆదేశించవచ్చని తెలిపారు. కేంద్రానికి చెందిన 10 ఏజెన్సీలే కాళేశ్వరానికి అనుమతులిచ్చిందని వెల్లడించారు. అందుకే కేంద్రమే సీబీఐ విచారణ కోరవచ్చన్నారు. అవినీతి నిరోధక చట్టం 17ఏ ప్రకారం కేంద్ర జలశక్తి శాఖ సీబీఐ విచారణ కోరవచ్చన్నారు. కాళేశ్వరంపై సీబీఐ విచారణకు తెలంగాణ ప్రభుత్వ అనుమతి అవసరం లేదన్నారు. సీబీఐ విచారణలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు నిందితులుగా తేలితే అప్పుడు అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 19 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం అనుమతి అవసరం ఉంటుందని నాగేశ్వరరావు వెల్లడించారు.

# అక్కడ అవార్డులిస్తారు.. ఇక్కడ అసత్య ప్రచారం చేస్తారు



హైదరాబాద్ : కేసీఆర్ వచ్చాక మంచినీటి సమస్య తీర్చారని మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు. నేడు ఆయన హైదరాబాద్‌లోని మల్లాపూర్‌లో మహిళా సమ్మేళనంలో మాట్లాడుతూ.. హైదరాబాద్ నీటి బిల్లులు కూడా లేవన్నారు. ఇంటింటికి మంచి నీళ్ళు అందించామన్నారు. మిషన్ భగీరథకు కేంద్రం అవార్డుల మీద అవార్డులు ఇచ్చిందన్నారు. కానీ ప్రధాని మోదీ వచ్చి పచ్చి అబద్ధాలు చెప్పారన్నారు. మోదీ ఢిల్లీలో అవార్డులు ఇస్తారని.. హైదరాబాద్‌కు వచ్చి అసత్య ప్రచారాలు చేస్తున్నారని హరీష్ రావు విమర్శించారు. మన మిషన్ భగీరథ పథకాన్ని కేంద్రంలో ఉన్న బీజేపీ కాపీ కొట్టిందన్నారు. కాంగ్రెస్ హయాంలో గల్లికో పేకాట క్లబ్బులు ఉ ండేవన్నారు. పేకాట క్లబ్బు నుంచి కోట్ల రూపాయలు కాంగ్రెస్ నేతల జేబుకు వెళ్లేవన్నారు. కాంగ్రెస్ మళ్ళీ అధికారం లోకి వస్తే పేకాట క్లబ్బులు వస్తాయన్నారు. కేసీఆర్ వచ్చాక పేకాట క్లబ్బులను ఉక్కు పాదంతో తొక్కేశారని హరీష్ రావు పేర్కొన్నారు.

# బీఆర్ఎస్, బీజేపీలు ఒక్కటే.. ఆ రెండు పార్టీలను ఓడించడమే లక్ష్యం



సిద్దిపేట : హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నం ప్రభాకర్ నేడు నామినేషన్ దాఖలు చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఆర్వో కార్యాలయంలో ఆయన తన నామినేషన్ పత్రాలను అందజేశారు. సీపీఐతో కాంగ్రెస్ పార్టీ పొత్తు పెట్టుకున్న నేపథ్యంలో పొన్నం నామినేషన్ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పాల్గొన్నారు. పొన్నం నామినేషన్ దాఖలు చేసిన అనంతరం చాడ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో సీపీఐ శ్రేణులు కాంగ్రెస్ పార్టీని గెలిపించడానికి కృషి చేస్తారన్నారు. అపర భగీరథుడు అని గొప్పలు చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి కేసీఆర్ కట్టించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కృంగిపోయిందన్నారు. హుస్నాబాద్ మెట్ట ప్రాంత వరదాయని గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేయలేదని.. హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్ కుమార్ పట్టించుకోలేదని విఫలమయ్యాడని చాడ పేర్కొన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు రెండు ఒక్కటేనని.. రాష్ట్రంలో ఆ రెండు పార్టీలను ఓడించడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. పొన్నం ప్రభాకర్ గెలుపు కమ్యూనిస్టుల గెలుపుగా భావిస్తున్నామని చాడ వెంకటరెడ్డి తెలిపారు.

# కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి కంటే మెరుగైన పోర్టల్: రేవంత్‌రెడ్డి



ఖానాపూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే ధరణి కంటే మెరుగైన పోర్టల్‌ను తీసుకొస్తామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం రాగానే ధరణిని బంగాళాఖాతంలో కలుపుతామని వ్యాఖ్యానించారు. ఖానాపూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జు పటేల్‌కు మద్దతుగా నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరి సభలో రేవంత్ మాట్లాడారు. "డబ్బును చూసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించలేదు. భారాస నేతల వద్ద డబ్బులుంటే కాంగ్రెస్ అభ్యర్థుల వద్ద ఓట్లు ఉన్నాయి. భారాస, భాజపాలు డబ్బును చూసి అభ్యర్థులను ఎంపిక చేశాయి. ఆదిలాబాద్ జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును ప్రతిపాదించాం. భారాస ప్రభుత్వం కడెం ప్రాజెక్టు నిర్వహణ చేపట్టలేకపోతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు, పేదలకు భూములు ఇచ్చింది.

భారాస ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చి పేదల భూములను గంజుకుంది. రైతులను భారాస ప్రభుత్వం నిండా ముంచింది. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తాం" అని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

# తెలంగాణలో ఈడీ, ఐటీ దాడులకు ప్లాన్ రెడీ: పొంగులేటి వ్యాఖ్యలు

ఖమ్మం: తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాజకీయం రసవత్తరంగా మారింది. ఎన్నికల్లో ప్రచారంలో భాగంగా నేతలు ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు గుప్పించుకుంటున్నారు. అలాగే, అధికారంలోకి వచ్చే తామే అంటూ కామెంట్స్ చేస్తూ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. ఇక, ఎన్నికల వేళ తెలంగాణలో ఐడీ, ఈడీ దాడులు జరుగుతాయని ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు కాంగ్రెస్ నేత పొంగులేటి శ్రీనివాస రెడ్డి. దీంతో, ఆయన కామెంట్స్ చర్చనీయాంశంగా మారాయి. వివరాల ప్రకారం.. పొంగులేటి శ్రీనివాస్ బుధవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా తెలంగాణలో ఐటీ, ఈడీ దాడులు జరుగుబోతున్నాయి. బీఆర్ఎస్, బీజేపీ కలిసి కాంగ్రెస్‌పై దాడికి సిద్ధమవుతున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందనే భయంతోనే దాడులకు ప్లాన్ చేస్తున్నారు. తెలంగాణలో రోజురోజుకి కాంగ్రెస్ పార్టీకి మద్దతు పెరుగుతోంది. కాంగ్రెస్‌లో చేరిన తర్వాత బీఆర్ఎస్ సూచనల మేరకు కేంద్ర సంస్థలు నామీద, నా కుటుంబ సభ్యుల మీద, నాకు మద్దతిచ్చే వారిపై దాడులు చేసేందుకు రెడీ అవుతున్నారు.



**కాళేశ్వరం ఖేల్ ఖతం..** తెలంగాణలో కాళేశ్వరం ప్రాజెక్ట్ అద్భుతమని కేసీఆర్ ప్రగల్భాలు పలికారు. కానీ, కాళేశ్వరం నిజ స్వరూపమేంటో కేంద్రం నివేదికల్లో వెల్లడించింది. కాళేశ్వరంలో కేసీఆర్ అవినీతికి పాల్పడినట్టు అర్థం అవుతోంది. కాళేశ్వరం, మేడిగడ్డ, సుందిళ్ల ఏదో ఒకరోజు కూలిపోతాయి. కాళేశ్వరాన్ని కేసీఆర్ ఏటీఎంలా వాడుకున్నారని చెప్పిన బీజేపీ.. ఆయన్ను ఎందుకు అరెస్ట్ చేయడం లేదు. కేసీఆర్‌ను ఎందుకు విచారించడం లేదు. ఈ ప్రాజెక్ట్ విషయంలో ముఖ్యమైన డాక్యుమెంట్స్‌ను మాయం చేసే అవకాశం ఉంది. తక్షణమే దీనిపై చర్యలు తీసుకోవాలి అని డిమాండ్ చేశారు. ప్రజలు కోరుకున్న ఇందిరమ్మ రాజ్యం రాబోతుంది. ఈనెల 15వ తేదీ తర్వాత ప్రియాంక, రాహుల్ గాంధీ రాష్ట్రంలో పర్యటిస్తారు. తెలంగాణలో దొరల పాలన వద్దు. ప్రజల పాలన కావాలి. ఎన్నికల కురుక్షేత్రంలో కాంగ్రెస్ అభ్యర్థులు గెలవబోతున్నారు. తెలంగాణ పోలీసులు వారి పరిధిలో పార్టీలకు అతీతంగా నడుచుకోవాలని సూచించారు.

# తెలంగాణ ఎన్నికల బందోబస్తుకు 5 వేల మంది తమిళ పోలీసులు

## - రాష్ట్రప్రభుత్వాన్ని కోరిన తెలంగాణ ప్రధాన కార్యదర్శి



చెన్నై : ఎన్నికల భద్రతా విధులు చేపట్టేందుకు 5 వేల మంది పోలీసులను పంపించాలని రాష్ట్రప్రభుత్వానికి తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి లేఖ రాశారు. తెలంగాణ, మధ్యప్రదేశ్, మిజోరం, రాజస్థాన్, ఛత్తీస్?ఘడ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. మిజోరం, ఛత్తీస్?ఘడ్ ఎన్నికలు మంగళవారం జరిగాయి. మిగిలిన రాష్ట్రాల్లో ఒకటైన తెలంగాణలో ఈ నెల 30వ తేది ఎన్నికలు జరుగనున్నాయి. ఈ ఎన్నికల భద్రతా విధులు చేపట్టేందుకు 5 వేల మంది పోలీసులను పంపాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాష్ట్రప్రభుత్వానికి లేఖ రాశారు. ఈ విషయమై తమిళనాడు హోంగార్డు విభాగం డీజీపీ వన్నియపెరుమాళ్ అన్ని జిల్లాల ఎస్పీలకు పంపిన సర్క్యులర్‌లో, ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న పోలీసులను ఈ నెల 27వ తేది తెలంగాణకు పంపించాలని పేర్కొన్నారు.

# మంత్రి గంగులకు హైకోర్టులో ఊరట.. పొన్నం పిటిషన్ కొట్టివేత



హైదరాబాద్/ కరీంనగర్: తెలంగాణ మంత్రి గంగుల కమలాకర్‌కు హైకోర్టులో ఊరట లభించింది. 2018లో కరీంనగర్ ఎమ్మెల్యేగా గంగుల ఎన్నిక చెల్లదంటూ దాఖలైన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు బుధవారం కొట్టివేసింది. ఈసీ నిర్ధారించిన వ్యయానికి మించి గంగుల ఎన్నికల ఖర్చు చేశారని కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ హైకోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టు నేడు విచారణ జరిపింది. ఇరువైపులా వాదనలు విన్న ధర్మాసనం.. సరైన ఆధారాలు లేవంటూ పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది. మరోవైపు గంగుల ఎన్నికను రద్దు చేయాలంటూ బీజేపీ కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు గురువారం విచారణ చేపట్టనుంది.


# సెంటిమెంటుకి హుస్నాబాద్.. అభివృద్దేమో సిద్దిపేట, గజ్వేల్‌లో..



హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మొదటి సెట్ నామినేషన్ పత్రాలను పొన్నం ప్రభాకర్ దాఖలు చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఆర్వో కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకటరెడ్డి తో కలిసి వెళ్లి నామినేషన్ వేశారు. సిద్దిపేట : హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మొదటి సెట్ నామినేషన్ పత్రాలను పొన్నం ప్రభాకర్ దాఖలు చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఆర్వో కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకటరెడ్డి తో కలిసి వెళ్లి నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత హుస్నాబాద్ మెట్ట ప్రాంతం నిర్లక్ష్యానికి గురైందన్నారు. సెంటిమెంట్‌కేమో హుస్నాబాద్ అంటున్నారని.. అభివృద్ధి అంతా గజ్వేల్, సిద్దిపేటలో చేస్తున్నారన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టును కుర్చీ వేసుకొని పూర్తి చేస్తానన్న ముఖ్యమంత్రి కేసీఆర్ పదేళ్లయిన పూర్తి చేయలేదని పొన్నం పేర్కొన్నారు. హుస్నాబాద్ ప్రాంతానికి వెన్నెముక లాంటి గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టులు పూర్తి చేయలేదు.. కాబట్టే హుస్నాబాద్ ప్రాంత ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు.

# హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో వర్షం.. రోడ్లపైకి చేరిన వర్షపు నీరు

హైదరాబాద్: తెలంగాణ రాజధాని హైదరాబాద్ నగరంలో పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షం పడుతోంది. వర్షపు నీరు రోడ్లపైకి చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కారణంగా రోడ్లపై వాహనదారులు నెమ్మదిగా వెళ్తుండడంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజాగుట్ట, లక్డీకాపూల్, అబిడ్స్, ఖైరతాబాద్, నాంపల్లి, సికింద్రాబాద్, హిమాయత్ నగర్, కోఠీ, నారాయణగూడతోపాటు తరతర ప్రాంతాల్లో వాన పడుతోంది.



Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com